నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ప్రకాశం | బాపట్ల
గురువారం 10 ఏప్రిల్ 2025 పేజీలు 8

## బస్సు ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా విడుదల

**సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే ఏలూరి లేఖ**

**ఒక్కో బాధిత కుటుంబానికి 15 లక్షలు మంజూరు**

**క్షతగాత్రులకు రెండున్నర లక్షలు విడుదల**

**సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి**



పర్చూరు, మేజర్ న్యూస్: పసుమర్రు చిలకలూరిపేట మధ్య గత ఏడాది మేలో జరిగిన రోడ్డు (బస్సు) ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా విడుదల చేసింది. బస్సు ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకొని అండగా నిలవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి లేఖలు అందజేశారు. ఇటీవల చిన్నగంజాం పర్యటనలో ఈ అంశాన్ని ఎమ్మెల్యే ఏలూరి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి తక్షణమే స్పందించిన ముఖ్య మంత్రి చంద్రబాబు బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు

మిగతా 3లో

# వేసవిలో తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు

**గ్రామీణ ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి**

**మూగజీవాలకు నీటి తొట్టెలు నిర్మించాలి**

**ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలపై యంత్రాంగం దృష్టి సారించాలి**

**జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశంలో ఎంపి మాగుంట**

**కలెక్టర్‌కు స్కోచ్ అవార్డు రావడంపై ప్రజాప్రతినిధుల అభినందనలు**

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఈ వేసవి కాలంలో జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు పటిష్టంగా చేపట్టాలని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాల్లో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం (దిశ) జరిగింది. ఈ సమావేశంలో పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాతో కలసి జాతీయ ఉపాధి హామీ పథకం, జల జీవన్ మిషన్ కార్యక్రమం, పీఎం సూర్య ఘర్ పథకం, పీఎం గ్రామీణ సడక్ యోజన, పీఎం ఆవాస్ యోజన పథకాల కింద పేదలకు మంజూరు చేసిన గృహ నిర్మాణాల పురోగతి, అమృత్ 1, అమృత్ 2 పథకాల ద్వారా ప్రజలకు తాగునీటి పథకాలు అమలు, పురోగతిపై శాఖల వారీగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కనిగిరి, సంతనూతలపాడు శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, బి.ఎన్.విజయకుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ, ఎంపిపి.లు, జడ్పిటిసిలు, సంబంధిత శాఖల










జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ చైర్మన్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, పురోగతిపై ప్రతి మూడు నెలలకొకసారి సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ వేసవి కాలంలో జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు పటిష్టంగా చేపట్టాలన్నారు. ప్రజలతో పాటు మూగ జీవాలకు కూడా త్రాగు నీరు అందించే లక్ష్యంతో నిర్మించే పశువుల నీటి తొట్టెల నిర్మాణాలను నిర్దేశించిన లక్ష్యం మేరకు త్వరగా పుర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాబోవు 3 నెలలకు (ఏప్రిల్-జూన్) మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లా లోని ఉపాది కూలీలకు 1.11 కోట్ల పని దినాలను 2.95 లక్షల కుటుంబాలకు లబ్ది చేకూర్చేలా లక్ష్యాలు నిర్దేశించడమైనదని, తదనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం

**పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగస్వాములు కావాలి: కలెక్టర్ అన్సారియా**

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుండి 22 వ తేదీ వరకు 15 రోజుల పాటు జిల్లావ్యాప్తంగా 7వ పౌష్టికాహార పక్షోత్సవాలు (పోషణ్ పఖ్వాడా) రోజుకు ఒక కార్యక్రమంతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని,

మిగతా 3లో

## పోషణ్ పఖ్వాడాతో పూర్తిస్థాయిలో అవగాహన

**గర్భిణీలు ప్రవసం నాటి నుంచే పౌష్టికాహారం తీసుకోవాలి**

**అవగాహన కార్యక్రమ ప్రారంభోత్సవంలో కలెక్టర్ జె.వెంకటమురళి, ఎమ్మెల్యే వేగేశన**

బాపట్ల, మేజర్‌న్యూస్: మహిళా శిశు సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. బుధవారం స్థానిక సాయిరామ్ గార్డెన్ కన్వెన్షన్ హాలులో జిల్లాస్థాయి పోషన్ పఖ్వాడా అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా శిశు సంక్షేమం కోసం పోషణ్ పఖ్వాడా కార్యక్రమాన్ని ఈనెల 8 నుండి 22 వరకు నిర్వహించడానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గర్భిణీలు ప్రసవాలు అయిన నాటి నుండి పుట్టిన బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకు ఎలాంటి పౌష్టికాహారం తీసుకోవాలి, ఎలాంటి ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. మహిళలు గర్భం దాల్చిన తర్వాత వారి ఆరోగ్య పరిస్థితులు బీపీ, షుగర్, రక్తహీనతకు సంబంధించిన వ్యాధులను గుర్తించి వారికి అవసరమైన మందులు ఇవ్వాలని, శిశువు పుట్టిన మొదటి 360 రోజులు వారి శారీరక దృఢత్వం కోసం అవసరమైన పౌష్టికాహారం అందించాలని, అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆరోగ్యకరమైన, బలవంతమైన ఆహారాన్ని అందించ డానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనాధ శిశువుల కోసం రైల్వే స్టేషన్లో బస్టాండ్‌లో

మిగతా 3లో







## పశ్చిమ బైపాస్ నిర్మాణంపై దృష్టి పెట్టాలి

**ఒంగోలులో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు చేపట్టాలి**

**భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రతిపాదనలు రూపొందించాలి**

**అధికారుల సమీక్షలో ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి**

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఒంగోలు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేలా పశ్చిమ బైపాస్ రోడ్డు నిర్మాణంపై దృష్టి పెట్టినట్లు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి చెప్పారు. దీని ప్రతిపాదనలపై జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియాతో కలిసి బుధవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. నగరంలో ట్రాఫిక్ రద్దీ, ప్రమాదాలను తగ్గించడంతో పాటు గ్రానైట్ రవాణా చేసే వాహనాలను నగరం వెలుపల నుంచి మళ్ళించేలా త్రోవగుంట నుంచి పెళ్లూరు వరకూ పశ్చిమం వైపున బైపాస్ రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలతో పాటు భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆయన సూచించారు. అందుకోసమే ప్రాథమికంగా ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాదే పనులు ప్రారంభించేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆయన సూచించారు. సంబంధిత శాసనసభ్యులు అందరినీ సంప్రదించి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ సంతనూతలపాడులో

మిగతా 3లో

సూర్య
www.suryaa.com



## కార్యకర్త కుటుంబానికి మంత్రి అనగాని సాయం



రేపల్లె, మేజర్‌న్యూస్: రేపల్లెపట్టణం 5 వ వార్డు కు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త నన్నెపాముల కోటయ్య సతీమణి నన్నెపాముల మరియమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి రాష్ట్ర మంత్రి వర్యులు అనగాని సత్యప్రసాద్ అందించిన రూ/-10 వేల రూపాయలను ఆ కుటుంబానికి అందజేసిన తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు జి.పి.రామా రావు,టీడీపీ ఆఫీసు కార్యదర్శి జి.వి.నాగేశ్వరరావు,వార్డు నాయకులు నీలా వెంకట కోటేశ్వరరావు,బెజ్జం సాంబయ్య,గాలి నరసింహారావు,విప్పర్ల రాజు,నీలా గణేష్,పిల్లి కిషోర్ లు బాధిత కుటుంబానికి అందజేశారు.

## బాపట్ల డిసిహెచ్‌ఎస్‌గా డాక్టర్ మోసెస్‌కుమార్



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల శ్రీ పొట్టి శ్రీరాములు ఏరియా వైద్యశాలలో జిల్లా కోఆర్డినేటర్ హాస్పిటల్స్ సర్వీసెస్ కు సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ పీడియాట్రిక్స్ డాక్టర్ ఎన్.మోసెస్ కుమార్‌ను నియమించారు. డిఎస్‌హ్ అధికారులు. పూర్వపు జిల్లా కోఆర్డినేటర్ హాస్పిటల్స్ సర్వీసెస్ డాక్టర్ వి శేషు కుమార్ కృష్ణాజిల్లా కు బదిలీ అయ్యారు అని తెలిపారు బాపట్ల ఏరియా వైద్యశాల సూపర్నెంట్ డాక్టర్ కొప్పుల సిద్ధార్థ్.

## లంకేవానిదిబ్బ గ్రామానికి నూతన బస్ సర్వీసు



రేపల్లె, మేజర్‌న్యూస్: రేపల్లె డిపో నుండి లంకెవానిదిబ్బకు (వయా) పెనుమూడి, చాట్రగడ్డ, పిరాట్లంక, గంగడి పాలెం మీదగా రేపల్లె డిపో నుండి నూతన సర్విస్ ప్రారంభించబడుతున్నదని రేపల్లె డిపో మేనేజర్ సుశీల్ కుమార్ తెలిపారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఈ బస్సు రేపల్లె నందు ఉదయం 5.30, 9.30 సాయంత్రం 6.10 లకు బయలుదేరును. తిరిగి లంకెవానిదిబ్బ నందు ఉదయం 7:00, 11:00 రాత్రి 7:40 ని. లకు బయలుదేరును. ప్రస్తుతం నడుస్తున్న. రేపల్లె లంకెవానిదిబ్బ (వయా) నల్లూరుపాలెం, తుమ్మల ,మోళ్ల గుంట, గంగడిపాలెం సర్విస్ యధావిధిగా తిరుగుతుందని డిపో మేనేజర్ తెలిపారు.. ఈ సర్విస్ రేపల్లె నందు ఉదయం 6:15 ,11:00 మధ్యాహ్నం 2:30, సాయంత్రం 6:15( గంగడి పాలెం వరకు) మరియు రాత్రి 9:30 గంటలకు బయలుదేరుతుంది. కావున ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఏపీఎస్ఆర్టీసీని ఆదరించవలసినదిగా రేపల్లె డిపో మేనేజర్ సుశీల్ కుమార్ కోరారు.

## కన్నతల్లిని హతమార్చిన తనయుడు





భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: తాగిన మైకంలో కన్నతల్లినే ఆమె పెద్ద కుమారుడు కడతేర్చినట్లు భట్టిప్రోలు ఎస్సై ఎం శివయ్య తెలిపారు.యస్ ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అంగలకుదురు బసవపూర్ణమ్మ (74) పెద్ద కుమారుడు దుర్గారావు భార్య బిడ్డలను వదిలి తల్లి వద్ద జీవనం సాగిస్తున్నాడు.నిత్యం తప్ప తాగి తల్లిని దుర్భాషలాడుతూ,డబ్బుల కోసం పీడించేవాడని,ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 10 గంటలకు రూ 100 లు కావాలని తల్లిని వేధిస్తున్న నేపథ్యంలో ఆమె నిరాకరించటంతో గొడవ ప్రారంభమైంది.చుట్టుపక్కల వారు ఈవిషయాన్ని మృతురాలి రెండవ కుమారుడు వెంకటేశ్వర్లు కు తెలియపరిచారు.అతను వచ్చే సమయానికి తల్లి రక్తపు మడుగులో పడి ఉంది.బసవపూర్ణమ్మను చెవి పైన,తల మీద కత్తిపీటతో దుర్గారావు దాడి చేసినట్టు ఆయన తెలిపారు.108 వాహనం ద్వారా వైద్యశాలకు తరలించేందుకు ప్రయత్నించినప్పటికీ చనిపోయినట్లు నిర్ధారించారు.ఈ మేరకు చిన్న కుమారుడు వెంకటేశ్వర్లు ఇచ్చిన రిపోర్టు ప్రకారం కేసు నమోదు చేసి రేపల్లె డిఎస్పి ఆవుల శ్రీనివాసరావు పర్యవేక్షణలో,వేమూరు సిఐ పసుపులేటి వీరాంజనేయులు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.మృతురాలికి శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె వైద్యశాలకు తరలించినట్లు ఎస్ ఐ శివయ్య తెలిపారు.

## ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే వేగేశన



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణంలోని శాసనసభ్యుల వారి క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల నియోజకవర్గం శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను స్వయంగా విని వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బాపట్ల నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ప్రజా దర్బార్ ద్వారా ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించే దిశగా పని చేస్తామన్నారు. బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు పని చేయాలని సూచించారు. బాపట్ల నియోజకవర్గ ప్రజల నుండి స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు.రానున్న రోజుల్లో బాపట్ల నియోజకవర్గంలోని అన్నీ గ్రామాల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.

## మాజీ సైనికుడికి అండగా తాండ్ర



బాపట్ల, మేజర్‌న్యూస్: అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం, మోరువండ్ల పంచాయతీ పరిధిలోని పెద్దవంకపల్లి గ్రామానికి చెందిన మాజీ సైనికుడు చంద్రగిరి లక్ష్మన్న కుమారుడు వెంకటాద్రి కి చెందిన భూమి కబ్జా కి గురి కాగా మనస్తాపంతో ఆత్మ హత్య చేసుకున్న సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ మదనపల్లి అసోసియేషన్ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు తో కలిసి బాధిత మాజీ సైనికుని కుటుంబాన్ని పరామర్శించి వారికి జరిగిన అన్యాయం పై సుదీర్ఘంగా చర్చించి, కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ వేద స్వరూప్, మదనపల్లి డీఎస్పీ లతో సమావేశమై బాధిత మాజీ సైనికుని కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలి అని వినతి పత్రాన్ని అందించారు. రాష్ట్ర అసోసి యేషన్ ఉపాధ్యక్షులు పి విశ్వేశ్వర రావు, రాష్ట్ర ప్రధా టన కార్యదర్శి సూరెడ్డి శివకుమార్, అనంత పురం, కడప, సత్య సాయి, చిత్తూరు, మదనపల్లి, కర్నూలు జిల్లా ల మాజీ సైనికులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి: సిపిఎం



రేపల్లె మేజర్‌న్యూస్: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచి సామాన్యులపై భారమోపిందని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి చిక్కాల మణి లాల్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కేంద్రప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలపై సిపిఎం ఆధ్వర్యంలో రేపల్లె నెహ్రూ బొమ్మవద్ద నిరసన తెలియజే శారు. పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరలను వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఎన్నికల ముందు గ్యాస్ ధర కొంతమేర తగ్గించి ఇప్పుడు మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలు ఆహారం వండటానికి ఉపయోగించుకునే ప్రధానమైన గ్యాస్ సిలిండర్ ధర 50 రూపాయలు పెంచటం అంటే ప్రజలని మోసంచేయడం అని ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం ప్రజాసంఘాల నేతలు కేవీ.లక్ష్మణరావు, కె.ఆశీర్వాదం, వై.కిషోర్, కె.గోపి, కే.రమేష్, కే.నాంచారమ్మ,డి.అగస్టిన్, జి.దానియేలు, డి.బాబు రావు,వై.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని నామన పూజలు



బాపట్ల, మేజర్‌న్యూస్: సింగపూర్ దేశంలో విద్యను అభ్యసిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ పాఠశాలలో జరిగిన అగ్నిప్రమాదంలో అస్వస్థకు గురై వైద్యం పొందుతున్న సందర్భంగా త్వరగా కోలుకోవాలని బాపట్ల నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివ నారాయణ పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీ భగలాముఖి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిట్లవారిపాలెం మండల అధ్యక్షులు హుస్సేన్ బేగ్ (దాదా) బాపట్ల రూరల్ మండలం అధ్యక్షులు దాసరి ఏసుబాబు, ఉమ్మడి గుంటూరు జిల్లా లీగల్ సెల్ సభ్యురాలు, ఏరియా హాస్పిటల్ డెవలప్మెంట్ సభ్యురాలు జిడుగు విజయ మాధురి, దమ్మన్నవారిపాలెం సర్పంచ్ జగ్గయ్య, యాజలి గ్రామ పార్టీ అధ్యక్షులు తోట శ్రీనివా సరావు, సత్యనారాయణ మాస్టారు,ఊస మాధవి, ఇక్కుర్తి చక్రపాణి,మెండు కిషోర్, ఇమడాబత్తిన సుధాకర్, సయ్యద్ అన్సారీ, సయ్యద్ సద్దాం హుస్సేన్, షైక్ జహీరబాషా, షైక్ అలీ, షైక్ షరీఫా, కట్టుపల్లి మధుబాబు, హస్సన్ బేగ్,షైక్ రఫీ,చల్లపల్లి ఏసోబు, గజ్జె వెంకటేష్ , జిడుగు రాజేష్,గండూరి మోహన్, జన సైనికులు, వీర మహిళలు, పాల్గొన్నారు.

## భట్టిప్రోలు మండలంలో విద్యుత్ శాఖ తనిఖీలు



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: విద్యుత్ వినియోగ దారులందరూ వారు ఉపయోగించే లోడుకు సంబంధించి తగిన ప్లాన్ ఎంచుకొని వినియోగించుకోవాలని,విద్యుత్ చౌర్యాన్ని నివారించాలని తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవి పేర్కొన్నారు. బుధవారం ఆయన తెనాలి డివిజన్ పరిధిలో పనిచేసే 120 మంది సిబ్బందితో భట్టిప్రోలు మండల ఓంలోని 4700 పైచిలుకు సర్వీసులను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 66 మందికి పైగా సరైన లోడు నియంత్రణ లేకుండా వినియోగిస్తున్నారని అటువంటివారి నుండి రూ.2.92 లక్షల అపరాధ రుసుము వసూలు చేసినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో డివిజనల్ డిప్యూటీ ఇంజనీర్ ఎన్ ఎం ప్రసాద్,రేపల్లె డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి. శ్యామ్ సుధాకర్ బాబు,భట్టిప్రోలు అడిషనల్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎం శాంత కుమారి మరియు సిబ్బంది పాల్గొని తనిఖీలు నిర్వహించారు.



## రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం

అద్దంకి, మేజర్‌న్యూస్:రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో 452వ రక్తదానం బుధవారం జరిగింది. ఒంగోలులోని కిమ్స్ వైద్యశాలలో డ్రైవర్ సయ్యద్ చాంద్ భాషా(49) కి బైపాస్ సర్జరీ నిమిత్తం అర్జెంటుగా రక్తం కావలసినదిగా డాక్టర్లు సూచించారు. ఆ మేరకు వారి బంధువులు రొటేరియన్ హాజీ సయ్యద్ మౌలాలి, కరిముల్లా లను, రోటరీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ చుండూరి మురళీ సుధాకరరావుని సంప్రదిం చారు. వెంటనే స్పందించిన బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ మురళీ సుధాకరరావు బలిజపాలెం కి చెందిన ధర్మవరపు మోహన కృష్ణ, కాకాని పాలెం సచి వాలయం ఉద్యోగి మోతుకూరి రాజీవ్ లను ప్రోత్సహించి ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో ఇద్దరి చేత రక్తదానం చేయించారు. రక్తదాన ప్రోత్సా హకులు మురళీ సుధాకరరావుని, రక్త దాతలి ద్దరిని రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య అభినందించారు.

## జనసేన నాయకుల ప్రత్యేక పూజలు



బాపట్ల, మేజర్‌న్యూస్: ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ తనయుడు మార్క్ శంకర్ సింగపూర్‌లోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో అగ్నిప్రమాదం సంభవించిన ఘటనలో గాయాలయ్యాయని ప్రాథమిక సమాచారంతో మార్క్ శంకర్ గాయాల నుంచి త్వరగా కోలుకోవాలని బాపట్ల జనసైనికులు బుధవారం శ్రీ సువచ్చల సమేత ప్రపత్యాంజనేయస్వామి ఆలయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి, జనసేన నాయకులు ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం మండల అధ్యక్షుడు గోట్టిపాటి శ్రీకృష్ణ, బాపట్ల నియోజకవర్గ జనసైనికులు కారుమూరి అంజనేష్, పసుపులేటి మహేష్, కామిశెట్టి సాయి బాబు, కోకి రాజశేఖర్ రెడ్డి, పడమటి ధర్మారావు, చిలకల సురేంద్ర, విష్ణుమొలకల చంద్రమోహన్, పడమటి ధర్మారావు, దండుప్రోలు కిషోర్,బుర్రీ కిషోర్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## పెట్రోలు తదితర పెంచిన ధరలను తగ్గించాలి



భట్టిప్రోలు,మేజర్ న్యూస్: కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పెంచిన గ్యాస్,పెట్రోల్,డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని సిపిఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో తమ ప్రభుత్వం అధికారంలోనికి వస్తే ధరలను తగ్గిస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోనికి వచ్చిన బిజెపి ప్రభుత్వం 11 సంవత్సరాల కాలంలో లెక్కలేనన్నిసార్లు గ్యాస్,పెట్రోల్,డీజిల్ ధరలతో పాటు నిత్యావసర ధరలను పెంచుతూ ప్రజలపై పెను భారాలను మోపుతున్నదని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో ఏఐవై ఎఫ్ నాయకులు డి శ్రీనివాస రావు,ఓబులశెట్టి రమేష్, దాసరి నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.



## అంగన్వాడి, మున్సిపాలిటీ కార్మికుల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలి

కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలోని సుందరయ్య భవనంలో బుధవారం సిఐటియు శిక్షణా తరగతులు ఆర్.మాలకొండయ్య అధ్యక్షతన జరిగాయి. ప్రపంచీకరణ అధ్యయనంపై సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు క్లాసును బోధించగా తరగతులపై ప్రభావం అనే అంశంపై సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి బోధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మె కాలంలో వారి వేతనాలు పెంచుతానని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత మాట్లాడే పరిస్థితి లేదన్నారు. కొత్తగా తీసుకువచ్చిన యాప్‌లకు తగ్గట్టు అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లు పనిచేయకపోవడంతో అవస్థలు పడుతున్నారన్నారు. అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ శిక్షణ తరగతులలో సిఐటియు నాయకులు పిసికేశవరావు, బడుగు వెంకటేశ్వర్లు, పి.మహేష్, రజిని, కుమారి, రాజ్యలక్ష్మి, శేషయ్య, బాలస్వామి, పిచ్చయ్య, నరేంద్ర, ఆర్.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## మహా సూర్యవందనంలో ప్రపంచ రికార్డు



నాగులుప్పలపాడు, మేజర్‌న్యూస్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 7న అరకు ప్రభుత్వ డిగ్రి కళాశాల ఆవరణలో నిర్వహించిన మహా సూర్యవందనంలో ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి కామిశెట్టి శంకరరావు, మహేంద్రనాథ్‌లు ప్రపంచ రికార్డు సాదించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న బాల బాలికలు 21850 మందితో పాటు రెండు తెలుగు రాష్టాలనుండి యోగ గురువులు సాధకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 108 సూర్య నమస్కారాలు 108 నిమిషాల్లో ఉప్పుగుండూరు వివేకానంద సేవాసమితి యోగ శిక్షణా కేంద్రం వ్యవస్థాపకులు కామిశెట్టి శంకరరావు వారి కుమారుడు మహేంద్రనాధ్ పూర్తి చేసి రికార్డు సాదించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఏఎస్ దినేష్ కుమార్, యోగ గురువు శ్రీపతంజలి శ్రీనివాస్ అభినందించారు. అదేవిదంగా ప్రపంచ స్థాయిలో ఉప్పుగుండూరు గ్రామానికి మంచి గుర్తింపు తీసకురావడం పట్ల గ్రామస్తులుతో పాటు పలువురు అభినందించారు భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాదించాలని ఆంకాంక్షించారు.





## వేసవిలో తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు



**మొదటి పేజీ తరువాయి** ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలన్నారు. ఈ దిశ సమావేశంలో ప్రజాప్రతినిధులు ఏఏ సమస్యలను, అంశాలను ప్రస్తావించారో, ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు.

### పోతురాజు, నల్లకాలువల్లో పూడికతీత చేపట్టాలి: మేయర్

ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ నగరంలోని పోతురాజు కాలువ, నల్ల కాలువల్లో పుడిక తీత పనులు చేపట్టాల్సిన అవసరం వుందని కోరారు. అలాగే అమృత పథకం కింద ఒంగోలు నగరంలో చేపట్టిన పైప్ లైన్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నవని, వాటిని త్వరగా పూర్తీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

### అసంపూర్తి ప్రభుత్వ భవనాలు పూర్తి చేయాలి: ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి ప్రాంతం ఫ్లోరైడ్ పీడిత ప్రాంతమని, ఈ ప్రాంత ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, త్రాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పశ్చిమ ప్రకాశం ప్రాంతంలో ఉపాధి హామీ పథకం కింద కొత్త వాటర్ షెడ్స్ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. గత ప్రభుత్వ కాలంలో నిర్మించిన అముల్ సెంటర్స్‌ను వినియోగంలోకి తేవాల్సిన అవసరం వుందని, అలాగే అసంపూర్తిగా వున్న సచివాలయాలు, ఆర్‌బికె నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

### తాగునీటి సమస్య రాకుండా చూడాలి: ఎమ్మెల్యే బిఎన్

సంతనూతలపాడు శాసన సభ్యులు బి.ఎన్. విజయకుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, అమృత పథకం కింద సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలో చేపట్టే పనుల వివరాలు తెల్పాలని ఆయన అధికారులను కోరారు. ఈ సమావేశానికి హాజరైన పలువురు ఎంపిపిలు, జడ్పిటిసిలు ఆయా మండలాలకు సంబంధించిన పలు సమస్యలను సమావేశంలో ప్రస్తావించడం జరిగింది.

### కలెక్టర్‌కు స్కోచ్ అవార్డు రావడంపై అభినందనలు

బంగారు బాల్యం కార్యక్రమానికి గాను జాతీయ స్థాయిలో జిల్లాకు స్కోచ్ అవార్డు రావడం పట్ల పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా గారికి పూల మొక్కను బహుకరించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ చిరంజీవి, సి.పి.ఓ వెంకటేశ్వర రావు, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకర రావు, హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస సంజయ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోషణ్ పఖ్వాడాతో పూర్తిస్థాయిలో అవగాహన

**మొదటి పేజీ తరువాయి** ఊయలలు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. జిల్లాలో సఖి వన్ స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పోషన్ పఖ్వాడా కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతుందని అన్నారు. మహిళా శిశు సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. మహిళ సంక్షేమ శాఖ సంరక్షణలో ఉన్న పిల్లలను తమ సొంత పిల్లలు వలే ప్రేమాను రాగాలతో చూడాలని చెప్పారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సీమంత చేసుకున్న 20 మంది మహిళలకు వేగేశన ఫౌండేషన్ ద్వారా 5 వేల రూపాయల వంతున లక్ష రూపాయలు నిధులను ఇస్తున్నట్లు ప్రకటించారు.



ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ ను జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా 20 మంది గర్భిణీ స్త్రీలకు సీమంతాలు చేపట్టారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖఎస్.ఇ అనంతరాజు, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 19న శ్రీగిరిలో వసంతోత్సవం

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి 19 శనివారం వసంతోత్సవం నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి.వి.రామకృష్ణారావు వెల్లడించారు. ఉదయం 6 గంటలకు శ్రీవారికి సహస్ర నామార్చన, 8.30 నుండి విశేష స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవారికి వసంతోత్సవం అనంతరం 7.30 లకు శ్రీవారికి ఊంజల సేవ, బొల్లాపల్లి వెంకట ఫణిదీప్తి బృందంచే గాత్ర కచేరీ జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 9246465282 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



## టీ ప్యాలెస్‌ను ప్రారంభించిన కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని ఒంగోలు హైవేలో పాములపల్లి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి గణేష్ నూతనంగా ఏర్పాటు చేసిన టీ ప్యాలెస్ ప్రారంభోత్సవంలో గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారరు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగుంట్లలో నవోదయంపై చైతన్యం



కొమరోలు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని అల్లినగరం గ్రామపంచాయతీ ఎర్రగుంట్ల గ్రామంలో నవోదయం టు పాయింట్ జీరో కార్యక్రమంపై స్థానిక గిద్దలూరు ఎక్సైజ్ సిఐ జయరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మారుమూల గ్రామాల్లో నాటుసారా నిర్మూలన దానివల్ల జరిగే దుష్పరిణామాలను ప్రజల్లో అవగాహన పరిచి చైతన్యం చేయడానికి ప్రభుత్వం వాహనాన్ని ఏర్పాటు చేసి గ్రామాలలో ప్రజలకు చైతన్య పరచడం జరుగుతుందని తెలియజేశారు. గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి దస్తగిరి ఎక్సైజ్ సిబ్బంది షరీఫ్, శ్రీపతి, హరిబాబు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పశ్చిమ బైపాస్ నిర్మాణంపై దృష్టి పెట్టాలి

**మొదటి పేజీ తరువాయి** ట్రాఫిక్ రద్దీని, గ్రానైట్ రవాణా చేసే హెవీ వాహనాల రాకపోకలను ప్రధానంగా నియంత్రంచాల్సి ఉందన్నారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డి.పి.ఆర్)ను రూపొందించేటప్పుడు ఈ అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై అధికారులు స్పందిస్తూ నిర్మాణ వ్యయం, సామాజిక, పర్యావరణ, ఇంజనీరింగ్, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రతిపాదనలను రూపొందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ వెంకట నాయుడు, ఆర్‌అండ్‌బి ఎస్.ఈ దేవానంద్, ఆర్.డబ్ల్యు.ఎస్.ఎస్.ఈ బాల శంకరరావు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు పాల్గొన్నారు.

## బస్సు ప్రమాద బాధితులకు ఎక్స్‌గ్రేషియా విడుదల

**మొదటి పేజీ తరువాయి** నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధిత కుటుంబాల ఖాతాలో నేరుగా జమ చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఏలూరికి సీఎంఓ నుంచి వెల్లడించారు. గత ఏడాది మే నెలలో బస్సు ప్రమాదంలో చిన్నగంజాం మండలం నీలాయపాలెంకు చెందిన కాశీ బ్రహ్మేశ్వరరావు, లక్ష్మి, ఖ్యాతి (శ్రీసాయి), గొనసపూడికి చెందిన దావులూరి శ్రీనివాస్ మృతి చెందారు. మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.15 లక్షలు చొప్పున, క్షతగాత్రులకు రూ.2.50 లక్షలు చొప్పున విడుదల చేశారు. వారిలో ముప్పరాజు దుర్గా పూజ, ముప్పరాజు వెంకట సుబ్బారావు, దొప్పలపూడి భావన, దావులూరి అంజమ్మలకు ఒక్కొక్కరికి రూ.15 లక్షలు చొప్పున, క్షతగాత్రులు బాడుగు సంజన, గడిపాటి తేజస్విని, దొప్పలపూడి భావనలకు ఒక్కొక్కరికి రెండున్నర లక్షలు చొప్పున నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా నిలిచినందుకు ఆ కుటుంబాల తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.



## అభివృద్ధి కమిటీ సభ్యులుగా కొర్రపాటి

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యునిగా కొర్రపాటి శ్రీనివాసరావు నియమితులు అయ్యారు. మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, అను చరులు కొర్రపాటి శ్రీనివాసరావుకు జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యుని గాఎంపికైన సందర్భంగా కలెక్టర్ అన్సారీయాకి, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామీణ ప్రాంతంలో ఉన్న సమస్యలపై దృష్టి సవరించి అధికారులు ప్రజాప్రతిని దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి ధనవంతు కృషి చేస్తానని తెలిపారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి
- టిడిపి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే ముత్తుముల

గిద్దలూరు, మేజర్‌న్యూస్: ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేసిన మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలుగుదేశం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గత వైసిపి పాలనలో రాష్ట్రంలో నియోజకవర్గాల్లో గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి జరగకపోగా అవినీతి, అరాచకాలే జరిగాయని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తుంది అన్నారు. గత పాలనలో అనారోగ్యంతో బాధపడే పేదలకు ముఖ్య మంత్రి సహాయం నుండి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆనారోగ్యంతో బాధపడే పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నామని, గృహాలు లేని వారికి పక్కా గృహాలు మంజూరు చేస్తున్నామని, చెప్పిన మాట ప్రకారం ప్రతి నెల 1వ తేదీన పెంచిన పెన్షన్లు అందజేస్తున్నామని, గ్రామాల్లో రోడ్లు, త్రాగునీటి సమస్యలు పరిష్కారం చేస్తున్నామని, ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చిన వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కారం



చేస్తున్నామని. అయితే చేసిన ప్రతి మంచి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజలకు వివరించాలని, నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేసి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేస్తే ప్రజలే తమకు పట్టం కడతారన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలకు ఇప్పటి నుంచే కార్యకర్తలంతా సమాయత్తం కావాలని ప్రతి గ్రామంలో, ప్రతి బూత్‌లలో సమిష్టిగా కృషి చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో అసాధ్యం అనుకున్న విజయాన్ని, సుసాధ్యం చేసిన ఘనత టిడిపి కార్యకర్తలదేనని, టిడిపి కార్యకర్తల కృషి పట్టుదలతోనే నియోజకవర్గంలోనూ, రాష్ట్రంలోనూ తెలుగుదేశం అధికారంలో ఉందని, కష్టపడిన ప్రతి కార్యకర్తను తాను గుర్తు పెట్టుకుంటానని, వారికి తగిన ప్రాధాన్యతను ఇస్తానని తాను ఎల్లప్పుడూ మీ వాడిగా మీఇంటి వాడిగా నీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు క్లస్టర్ ఇన్చార్జ్‌లు, మండల నాయకులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే పబ్లిక్ గ్రీవెన్స్: ఎమ్మెల్యే

వేమూరు(భట్టిప్రోలు)మేజర్ న్యూస్: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పబ్లిక్ గ్రీవెన్స్ ఏర్పాటు ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు.బుధవారం వేమూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు నెలలో ప్రతి బుధవారం మండలాల వారీగా ప్రతి మండలంలో పబ్లిక్ గ్రీవెన్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యేలు ప్రజల్లో ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య ఉద్దేశమన్నారు.అదే రీతిలో నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేయడం జరుగుతుందని తెలియజేశారు,



కార్యక్రమంలో తహసిల్దార్ సుశీల,మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు,ఈ ఓ పి ఆర్ డి శేఖర్ మండలం లోని వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు విజయబాబు,జనసేన పార్టీ నాయకులు వూసా రాజేష్, అమ్మిశెట్టి కిషోర్,షేక్ హనీఫ్, మన్నే పసి,బండారు సూరిబాబు,చావాలి సర్పంచ్ వి శ్రీనివాసరావు,చంపాడు సర్పంచి రత్నకుమారి,వేమూరి శేషుబాబు పాల్గొన్నారు.

## సీఎం హామీల అమలుకు చిత్తశుద్ధితో పనిచేయండి: కలెక్టర్

బాపట్ల, మేజర్‌న్యూస్: పర్చూరు నియోజకవర్గానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయుటకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పేదల సేవ కార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల అమలులో అధికారులకు జిల్లా కలెక్టర్ సూచనలు చేశారు. పర్చూరు నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి, ప్రతి మండలంలో ఒక అంబేద్కర్ భవన నిర్మాణానికి, విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్మాణానికి, గ్రావెల్ రోడ్ల ఏర్పాట్లకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. చినగంజం మండలంలో కొత్త గొల్లపాలెం గ్రామానికి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలలో వ్యక్తిగత అవసరాలకు సంబంధించి పనులను ఆయా శాఖలకు తెలియజేయాలని, నిబంధనల మేరకు వాటిని పూర్తి చేయుటకు చర్యలు



తీసుకోవాలని,అదేవిధంగా సామాజిక అవసరాలకు సంబంధించిన పనులను ఆయా శాఖలకు తెలియజేస్తూ వేరువేరుగా ఉత్తర్వులు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ముఖ్య ప్రణాళిక అధికారిని ఆదేశించారు. ఆ గ్రామంలో పి4 కింద ఎన్నిక కాబడిన కుటుంబాల అవసరాలను మార్గదర్శలతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని పిడి డిఆర్డిఏ ను ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, పిడి డిఆర్డిఏ కె. శ్రీనివాసరావు, ఏపీ సీపీడీసీఎల్ ఎస్సీ ఆంజనేయులు, హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉదారత చూపిన చందోలు ఎస్సై

పిట్టలవానిపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో ఫంక్షన్ కు వచ్చి తిరిగి అమర్తులూరు వెళుతున్న క్రమంలో ఆటోలో ప్రయాణిస్తు కంచర్ల శ్రావణి అను ఆమె చందోలు శ్రీవల్లి ఐస్ ఫ్యాక్టరీ ఎదురు జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు ఆమె ఆటోలో నుంచి జారి పడింది. సమాచారం అందుకున్న చందోలు ఎస్ఐ శివకుమార్ చేరుకుని వారి సిబ్బంది సహాయంతో 108 అంబులెన్స్ లో బాపట్ల ఏరియా గవర్నమెంట్ హాస్పిటల్ కి వైద్య నిమిత్తం పంపినారు.



## జులై నాటికి బాపట్లలో బోట్ షికార్: కలెక్టర్

బాపట్ల, మేజర్‌న్యూస్: సూర్యలంక, రామాపురం బీచ్ లను జూలై నెలలోగా పర్యాటక రంగంగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పర్యాటక శాఖ అధికారులు, కన్సల్టెంట్ లతో బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లా పర్యాటక ప్రాంతం కానున్నదని కలెక్టర్ చెప్పారు. జులై నెల నాటికి బోటింగ్ షికార్ అమల్లోకి తెచ్చేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. పర్యావరణానికి ఎలాంటి హాని, కాలుష్యం లేని ప్రాంతంగా ఈ రెండు బీచ్ లు ప్రాథమికంగా గుర్తించినట్లు చెప్పారు. ఇప్పటికే 20 మంది శాస్త్రవేత్తలు ఆ రెండు బీచ్ లలో పర్యటించి, అధ్యయనం చేశారని వివరించారు. పరిశుభ్రమైన ప్రాంతంగా బాపట్ల జిల్లాలోని ఆ రెండు బీచ్ లు ఉన్నాయన్నారు. రాజస్థాన్, గుజరాత్ లోని పర్యటక ప్రాంతాల మాదిరిగా తీర్చిదిద్దడానికి అడుగులు ముందుకు వేస్తున్నామన్నారు. బాపట్ల జిల్లాలో జీడి పప్పు ఉత్పత్తి అధికంగా ఉన్నందున విక్రయాలు, ఉత్పత్తి ప్రదర్శనలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. తాటి చెట్ల ఆధారంగా ఉత్పత్తులు పెంచేలా కళ్ళు గీత కార్మికులకు, బోటింగ్ షికారు జరిగేలా మత్స్యకారులకు కల్గరి శిక్షణ ఇవ్వాలన్నారు. చేనేత ఉత్పత్తుల పెంపు, ప్రదర్శనల కొరకు ప్రత్యేకంగా చర్యలు



తీసుకుంటామన్నారు. వాడరేవు వద్ద రెవెన్యూ అసోసియేషన్ కు సంబంధించిన ఒక ఎకరా భూమిని ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామన్నారు. లేదా ఏజెన్సీలకు ఆ భూమిని లీజ్ ఇవ్వడానికి పరిశీలనలు జరుగుతున్నాయన్నారు. పర్యాటకానికి ఎంతో ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామన్నారు. పేరలి కెనాల్ బోటింగ్ కు అనువైన ప్రాంత కాగా పర్యాటకల కొరకు సిద్ధం చేస్తున్నామన్నారు. బీచ్ ల వద్ద రిసార్ట్స్ నిర్వహణలపై రూపొందించిన నివేదికలపై ఆయన చర్చించారు. అత్యవసరమైన అభివృద్ధి కొరకు రూ.1.13కోట్ల నిధులతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, పర్యాటక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ లజ్వంతి నాయుడు, కన్సల్టెంట్ సాహితీ దివి, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు శక్తి యాప్: ఎస్పీ

బాపట్ల, మేజర్‌న్యూస్: భద్రతతో కూడిన ప్రయాణానికి భరోసాగా శక్తి యాప్ లోని సేఫ్ మై ట్రావెల్ సదుపాయం వినియోగించుకొవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో బుధవారం జిల్లాలోని శక్తి బృందాలు వారి పరిధిలోని కళాశాలలో, పాఠశాలలో, ప్రభుత్వ కార్యాలయాలలో, రైల్వేస్టేషన్ లలో, బస్టాండ్ లలో, ప్రధాన కూడళ్లలో ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో మహిళలకు, విద్యార్థినిలకు శక్తి యాప్ ఆవశ్యకతను గురించి విస్తృతంగా అవగాహన కల్పిస్తూ, యాప్ ను ఏవిధంగా మొబైల్ ఫోన్ లలో డౌన్లోడ్ చేసుకొని ఇన్స్టాల్ చేసుకోవాలో వివరిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళలకు విద్యార్థినులకు అత్యవసర సమయాలలో శక్తి యాప్ అండగా ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్ లో శక్తి యాప్ ఉంటే రక్షణగా పోలీసులు మీ వెంటే వున్నట్లేనని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ఆపదలో చిక్కుకున్న మహిళలు, విద్యార్థినిలు యాప్ లోని ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేస్తే దగ్గరలోని పోలీసులకు సమాచారం వెళుతుందన్నారు. వారు వేగవంతంగా ఘటన స్థలానికి చేరుకొని మహిళలకు రక్షణ కల్పిస్తారని తెలిపారు. దీనిలో హ్యాండ్ షేక్ అనే సదుపాయం ఉంటుందన్నారు. ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేసే పరిస్థితులలో లేనప్పుడు మొబైల్ ఫోన్ ను గట్టిగ షేక్ చేస్తే వెంటనే కంట్రోల్ రూమ్ కు సమాచారం అందుతుందన్నారు. తద్వారా నిమిషాల వ్యవధిలోనే పోలీసులు బాధితుల వద్దకు




చేరుకొని వారికి భద్రత కల్పిస్తారన్నారు. యాప్ లోని సేఫ్ ట్రావెల్ అనే సదుపాయం ఉంటుందన్నారు. మహిళలు విద్యార్థినులు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ఆటోలలో, క్యాబ్ లేదా ఇతర వాహనాల్లో ఒంటరిగా ప్రయాణించే సందర్భంలో సేఫ్ ట్రావెల్ సదుపాయాన్ని ఎంపిక చేసుకొని బయలుదేరే ప్రాంతం, చేరుకోవాల్సిన గమ్యస్థానం, ప్రయాణంచేసే వాహనం నెంబర్ తదితర వివరాలు అందులో నమోదు చేయాలన్నారు. వెంటనే స్థానిక పోలీసులను అప్రమత్తం చేసి ఘటన స్థలానికి పంపడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్ ల వివరాలు అక్కడి పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్లు, అత్యవసర నెంబర్లు ఈ యాప్ లో పొందుపరచబడి ఉన్నాయన్నారు. జిల్లాలోని మహిళలు విద్యార్థినిలు తమ మొబైల్ ఫోన్ లలో శక్తి యాప్ నిక్షిప్తం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

# వైభవంగా గ్రామదేవతల గ్రామోత్సవం





## ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని శీలంవారిపల్లె అంకాలమ్మ పోలేరమ్మ ఉత్సవాల సందర్భంగా మంగళవారం రాత్రి గ్రామదేవతల గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు, గ్రామపెద్దలు, దేవస్థానం కమిటీ నిర్వాహకులు ప్రత్యేక పూజలుచేసి గ్రామదేవతల గ్రామోత్సవం ప్రారంభించారు. అదేవిధంగా అంకాలమ్మ పోలేరమ్మ గ్రామదేవతల ఉత్సవాల సందర్భంగా దేవస్థానం ఆవరణ రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవార్లకు గ్రామంలోని ఇతర దేవతామూర్తులను పూజించి గ్రామంలో ఇంటింటికి తిరిగి సద్దిపోయించుకుని సమర్పించారు. అనంతరం రాత్రి అంకాలమ్మ పోలేరమ్మ గ్రామదేవతలను ప్రత్యేకంగా అలంకరణ చేసి దేవస్థానంలో పూజలు చేసి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పీఠంపై ప్రతిష్టించి తప్పెట్లు మేళతాళాలు డిజెశబ్దాలు బాణసంచా పేలుళ్ళ మధ్య యువకులు కేరింతలు డ్యాన్సులు చేస్తూ గ్రామంలో అమ్మవార్ల గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవతల గ్రామోత్సవం సందర్భంగా గ్రామంలో సందడి నెలకొన్నది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు, దేవస్థానం కమిటీ నిర్వాహకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పేస్‌లో 'సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్'పై ప్రత్యేక ఉపన్యాసం



టంగుటూరు, మేజర్‌న్యూస్: పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం "సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్'పై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ద్వితీయ సంవత్సరం ఏఐడీఎస్, ఏఐఎంఎల్ విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థిని, ప్రస్తుతం పరిశ్రమలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సుష్మా పోతు రాజు రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యారు. ఆమె సాఫ్ట్‌వేర్ టెస్టింగ్ ప్రాధాన్యత, రకాలు (మాన్యువల్, ఆటోమేషన్ టెస్టింగ్), బగ్ ట్రాకింగ్ టూల్స్ వినియోగం, అలాగే ప్రాజెక్ట్ నిర్వహణలో అవసరమయ్యే ముఖ్యమైన నైపుణ్యాలపై వివరించారు. ఈ సెషన్ ద్వారా విద్యార్థులు పరిశ్రమ అవసరాలను అర్థం చేసుకొని, తమ నైపుణ్యాలను మెరుగుపరచుకునే దిశగా ప్రేరణ పొందారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ, ఈ తరహా గెస్ట్ లెక్చర్లు విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహనను కలిగించి వారి భవిష్యత్తు కెరీర్‌కు మద్దతుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.కె. మూర్తి, ఇంటర్నేషనల్ రిలేషన్స్ డైరెక్టర్ మద్దిశెట్టి కళ్యాణ్, ఏఐడీఎస్ విభాగాధిపతి డాక్టర్ కె.సుధీర్ చక్రవర్తి, ఏఐఎంఎల్ విభాగాధిపతి ఎస్.కె.హినా కౌసర్, కో-కన్వీనర్ బి.ఎస్.ఎన్. శ్రావణి, కోఆర్డినేటర్లు జె.పవిత్ర, జి.శ్రీదేవి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌కు 150 అర్జీలు



చీరాల, మేజర్‌న్యూస్: మండలంలోని కొత్తపేట లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలకొండయ్య ప్రజల నుంచి స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 150 అర్జీలు అందాయని అందులో ఇళ్ల స్థలాల నిమిత్తం 80, పెన్షన్ కొరకు 45, రేషన్‌కార్డుల కోసం 25 అర్జీలు వచ్చాయాన్నారు. సందర్భంగా ఎమ్మెల్యే మాలకొండ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల ఎదుర్కొంటున్నా సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతి బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, చీరాల పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, వేటపాలెం మండలం మహిళా అధ్యక్షురాలు యర్ర శివ నాగమల్లేశ్వరి, జనసేన నాయకులు కారంపూడి పద్మిని, బిజెపి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బందికి అండగా ఉంటాం

## మున్సిపల్ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య



దర్శి, మేజర్‌న్యూస్: నగర పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందికి ఎల్లవేళలా అండగా ఉంటానని మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అన్నారు. మున్సిపల్ కార్యలయంలో పనిచేస్తున్న మున్సిపల్ వర్కర్ ఇత్తడి మూడో పుల్లయ్య అనారోగ్యంతో మరణించగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15వేలు భార్యకు చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మున్సిపల్ కమిషనర్ మహేష్, వైస్ చైర్మన్ స్టీఫెన్, మూడో వార్డు కౌన్సిలర్ దినకర్, ఆర్వో వెంకటేశ్వర్లు, గోపి సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలకు రక్షణ కవచం శక్తి యాప్

## ప్రతి ఒక్కరికి చేరువయ్యేలా అవగాహన కల్పిస్తున్న పోలీసులు



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు శక్తి టీం ముండ్లమూరు కేజీబీవీ విద్యార్థినిలకు శక్తి యాప్ ప్రాముఖ్యత, ఆవశ్యకత గురించి తెలియచేశారు. శక్తి టీం విద్యార్థినిలకు యాప్ గురించి తెలియజేసి, యాప్ డౌన్‌లోడ్, వినియోగం ఏ విధంగా చేయాలో వివరించారు. శక్తి యాప్ మహిళల భద్రత కొరకు రూపొందించబడిందని, అత్యవసర పరిస్థితులలో పోలీస్ తక్షణ సహాయం అవసరమైనప్పుడు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆపద ఆ సమయంలో ఎస్.ఓ.ఎస్ బటన్ ప్రెస్ చేసి ఎలా రక్షణ పొందవచ్చునో అవగాహన కల్పించారు. మహిళలు ఒంటరిగా ప్రయాణం చేసే సమయంలో యాప్‌లోని సేఫ్ ట్రావెల్ అను ఆప్షన్ ఎంచుకొని దానిలో ఎక్కడ నుండి ఎక్కడికి వెళుతున్నారను వివరాలు నమోదు చేస్తే వెళుతున్న మార్గాన్ని కంట్రోల్ రూమ్ నుండి ట్రాక్ చెయ్యబడుతుందన్నారు. ఆపద సమయంలో ఆడ, మగ, చిన్న,పెద్ద అనే వ్యత్యాసం లేకుండా ప్రతి ఒక్కరికి ఉపయోగకరమని ప్రజలకు చెప్పారు. మహిళల భద్రత, రక్షణ కోసం శక్తి యాప్‌ను తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ స్మార్ట్‌ఫోన్ నందు డౌన్లోడ్ చేసుకోవాలని వారికి అవగాహన కల్పించి, యాప్ డౌన్ లోడ్ చేశారు. ఆపదలో ఉన్న మహిళలకు శక్తి యాప్ ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుంది.

# ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: ఒంగోలులోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నియోజవర్గస్థాయిలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల నుండి ప్రజలు తమ సమస్యలకు సంబంధించి 30 అర్జీలను ఎమ్మెల్యే విజయ్ కుమార్‌కు అందజేశారు. ప్రజల నుండి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు.

# అశ్లీల కార్యక్రమాలకు తావు లేకుండా చూడండి...

## ప్రభల నిర్వహణ కమిటీ సమావేశంలో ఒంగోలు డిఎస్పీ శ్రీనివాసరావు

చీమకుర్తి, మేజర్‌న్యూస్: విద్యుత్ ప్రభలపై ఎలాంటి అశ్లీల కార్యక్రమాలకు తావు లేకుండా చూడాలని ఒంగోలు డి.ఎస్.పి. ఆర్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం చీమకుర్తి పోలీస్ స్టేషన్ లో .11న చీమకుర్తిలో జరిగే మందిరాల సంబరాలు, 12 న జరిగే రామతీర్థం తిరునాళ్ళకు సంబంధించి ప్రభల నిర్వహణ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీమకుర్తి సీఐ ఎం సుబ్బారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఒంగోలు డిఎస్పి ఆర్. శ్రీనివాసరావు మాట్లాడుతూ చీమకుర్తిలో జరుగు మందిరాల సంబరాలు, రామతీర్థం తిరునాళ్ళ ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. విద్యుత్ ప్రభల వద్ద నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు ఇచ్చిన సమయానికి నిలిపివేయాలని కమిటి మెంబెర్స్ తీసుకోవలిసిన జాగ్రతలను డీఎస్పీ శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ సమావేశంలో చీమకుర్తి ఎస్సై కృష్ణయ్య, ప్రభల నిర్వహణ కమిటీ సభ్యులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం, గుంటూరు టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా బి.కార్తీక్



ఒంగోలు, మేజర్‌న్యూస్: నగరంలోని ఎంపీ ఆఫీస్‌లో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చేతుల మీదుగా ప్రకాశం జిల్లా గుంటూరు టెలిఫోన్ అడ్వైసరీ కమిటీ మెంబర్‌గా కార్తీక్ భీమని నియమించడం జరిగింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు ఈ పదవి రావడానికి కృషి చేసిన మాగుంట శ్రీనివాసరెడ్డికి, మాగుంట రాఘవరెడ్డికి, దర్శి టీడీపీ ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మికి, కడియాల లలిత్ సాగర్‌కి, తాళ్లూరు మండల నాయకులకు, కార్యకర్తలకు అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.కాశిరెడ్డి, అంజిరెడ్డి, యల్లమందరెడ్డి, షేక్ మదారవలి పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

దర్శి, మేజర్‌న్యూస్: దర్శి నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో ఈ.ఆర్.ఓ జాన్సన్ సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శి, ముండ్లమూరు తహసీల్దార్‌లు యం.శ్రావణ్ కుమార్, లక్ష్మి నారాయణ, టిడిపి తరుపున పుల్లచెరువు చిన్న, బి.జె.పి తరుపున శ్రీనివాసులు, వైకాపా తరుపున మహేష్ పాల్గొన్నారు.



## ఘనంగా కృష్ణకిషోర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. వారి పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు తెలుగుదేశం కార్య కర్తలు వారికి పూలమాల శాలువాలు వేసి కేక్ కట్ చేయించి పుట్టినరోజు శు భాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ప్రజలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యతో పాటు నైపుణ్యత పెంచుకోవాలి



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని పెద్ద దోర్నాలలోని గ్రామపంచాయతీ సచివాలయంలో ఈ సేవ కేంద్రాల వద్ద విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు వృత్తి విద్యలో నైపుణ్యం అవసరమన్నారు. నైపుణ్యాభివృద్ధికి వొకేషనల్ విద్యా కోర్సులు పెద్ద దోర్నాల మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల దోర్నాలలోని వొకేషనల్ విద్యార్థులు ఆటోమోటివ్, ఐటి ట్రేడ్లలో భాగంగా ఈ నెల 3వ తేది నుండి 13వ తేది వరకు ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంలో పాల్గొంటున్నారు. ఇంటర్న్ షిప్ ప్రోగ్రాం దోర్నాలలోని ఆటోమొబైల్ షోరూమ్స్, మీ సేవ సెంటర్లో నిర్వహించుచు న్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వాహనాల సేల్స్, సర్వీసెస్ పని తీరుపై ప్రత్యక్ష అవగాహన, డేటా ఎంట్రీ, ఫొటో షాప్ వంటి వాటిలో నైపుణ్యం పొందిన వారిచే శిక్షణ అందించడం జరుగుతుంది. ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంలో 10వ తరగతి విద్యార్థులు పాల్గొని అవగాహన పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనసూయ దేవి, ఐటీ ఒకేషనల్ ట్రైనర్ సయ్యద్ నాయబ్ రసూల్, ప్రేమ్ చంద్ పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు



గిద్దలూరు, మేజర్‌న్యూస్: నియోజకవర్గ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు కృష్ణ కిషోర్ రెడ్డి జన్మదిన సందర్భంగా 11వ వార్డు కౌన్సిలర్ లోక్కు రమేష్ ఆధ్వర్యంలో కృష్ణ కిషోర్ రెడ్డి చేతుల మీదుగా గవర్నమెంట్ హాస్పిటల్ ఆవరణలో చలివేంద్రంను ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమ ంలో టిడిపి నాయకులు ఎలిసెట్టి వెంకటప్ప, దుత్త బాల ఈశ్వరయ్య, బిల్లా రమేష్, జడ్పిటిసి వ్రత మధు, గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, గవర్నమెంట్ హాస్పటల్ సూపరింటెండెంట్ ఆదాం, హాస్పిటల్స్ సిబ్బంది, గిద్దలూరు పట్టణ టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువ



కర్లపాలెం, మేజర్‌న్యూస్: ప్రకృతి వ్యవసాయం వల్ల పంట పెట్టుబడి తగ్గి ,రైతుకు ఆదాయం పెరుగుతుందని ఏ పి సి ఎన్ ఎఫ్ అడిషనల్ డిపిఎం జె.మోహన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో మండల స్థాయి వ్యవసాయ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ సాగులో ఉత్తమ రైతులు పిట్టు రామకృష్ణారెడ్డి, బొమ్మిశెట్టి చలపతి శ్రీనివాస్‌ను అధికా రులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ అద్దురి శ్రీనివా సరావు, ఏడిఏ లక్ష్మీ ,ఏ ఓ సుమంత్ కుమార్, ఏపిఎం శ్రీనివాసులు రెడ్డి ,గ్రామ వ్యవసాయ సహాయకులు,సి ఎన్ ఫ్ సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు

## ఉపాధి కార్డుల వినియోగంపై అవగాహన



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని చింతల పంచాయతీ గ్రామంలో ఐ.టి.డి.ఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట శివ ప్రసాద్, చెంచు గిరిజనులకు ఉపాధి హామీ పథకంపై అవగాహన కల్పిస్తూ, ప్రతి చెంచు కుటుంబం ఉపాధి హామీ కార్డు కలిగి ఉండా లని, ప్రజలందరు ఉపాధి హామీ కార్డు ద్వారా 150 రోజుల పనిదినాలను వినియోగించుకుని, ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్డులను ఐ.టి.డి.ఎ పరిధిలో 3 జిల్లాలు నంద్యాల, పల్నాడు, ప్రకాశం పరిధిలోని 187 చెంచు గ్రామాలలో దశల వారీగా పంపిణీ చేసి వారి జీవనోపాధి ప్రమాణా లను పెంచే ందుకు కృషి చేస్తామని వివరించారు. శ్రీశైలం పి.య మ్.యు ఆదర్శ యన్.జి.వో సిబ్బంది చింతలలో ఉపాధి హామీ పుస్తకాలను పంపిణి కార్య క్రమం ఏర్పాటు చేయుట జరిగింది. ఈ సందర్భం గా రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ, విజయవాడ పి.యమ్.యు సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కిరణ్ కుమార్ జాబ్ కార్డు గురించి వివరించి పి.వోచే 100 చెంచు కుటుంబాల కు కార్డులను ఇప్పించడం జరి గింది. కార్యక్రమంలో ఏ.ఆర్.హెచ్.డి. యస్. సంస్థ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ, దోర్నాల కో ఆర్డినే టర్ కరుణాకర్, సిబ్బంది, పల్నాడు పి.యం.యు ఏ.పి.వో కమురుద్దీన్, నంద్యాల ఏ.పి.వో మహ బూబ్ బాషా, దోర్నాల ఉపాధి హామీ టి.ఎ.లాల పాల్గొన్నారు.

## దానమ్మ కుటుంబాన్ని పరామర్శించిన దద్దాల



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండలం అదే పంచాయతీ కి చెందిన జుటిక దానమ్మ ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించారు. ఈ విషయం తెలుసుకొని బుధవారం మండల నాయ కులతో కలిసి లిఆమె కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం చేసిన కనిగిరి వైసీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఈ సంద ర్భంగా ఆమె మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపి మీ కు అండగా ఉంటాము అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివా సులరెడ్డి, మాజీ ఎంపీపీ సీనియర్ నాయకులు గాయం బలరామిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, సర్పంచ్ కత్తి రాజారావు,పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు సానికొమ్ము మధుసూదన్ రెడ్డి, బూత్ కమిటీ విభాగం అధ్యక్షులు కస్తాల బాలాజీ, మాజీ సర్పంచ్ గోబ్బిళ్ల శ్రీనివాస్ యాదవ్, ఇట్టెం కృష్ణ,శ్యామల సాంబిరెడ్డి, ఎరువా వెంకటరెడ్డి వెంకట కాశయ్య, మోర సాంబ, ఆంజనేయులు చెన్నారెడ్డి మల్లికార్జున, కంది నారాయణ రెడ్డి,మాజీ కో–ఆప్షన్ షేక్ మౌలాలి, యక్కంటి శ్రీరాములు రెడ్డి దేవిరెడ్డి వెంకటస్వామి రెడ్డి కొదమల కొండయ్య ఈర్ల శ్రీను, కంటూ కేశవ, జుటిక మోజెస్, భాస్కర్ సాల్మన్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోషణ పఖ్వాడపై బాలింతలకు గర్భిణీలకు అవగాహన




జరుగుమల్లి, మేజర్‌న్యూస్: పోషణ పక్వాడపై బాలింతలకు గర్భిణీ స్త్రీలకు బుధవారం మండల పరిధిలోని జరుగుమల్లి కామేపల్లి సెక్టర్ సూపర్వై జర్లు నిర్వహించిన గ్రామాలైన పైడిపాడు, కే.బిట్రగుంట గ్రామాలలో పోషణ పక్వాడా అనే కార్యక్రమంపై అవగాహన సెక్టార్ సూపర్వైజర్లు ఎల్.విజయ, పి.భారతి ఆధ్వర్యంలో చేపట్టారు. ఏడు నుంచి మూడు సంవత్సరాలు వైవిధ్యం విధా నం ఆహారం గురించి ఈ అవగాహన కార్యక్ర మంలో బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు వివరించడం జరిగింద న్నారు. అయితే అంగన్వాడి కేంద్రంలో ఇచ్చే పౌష్టిక ఆహారం వాటిని ఏ విధంగా వినియో గించుకోవాలో వివరించారు. ప్రధానంగా కిశోర బాలికలు తీసుకోవాల్సిన అవగాహన ఏ విధంగా చర్యలు తీసుకోవాలో ఏ విధంగా మార్పులు చేప ట్టాలో ఈ సదస్సులో తెలియపరిచినట్టు సూపర్వైజర్ తెలిపారు.

## భూముల రీసర్వేకు ప్రజలు సహకరించాలి



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: రైతుల భూము లను హద్దులు గుర్తించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టినట్లు రైతులు, ప్రజలు సహకరించాలని ఎంపిటిసి, మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు(వెంగయ్య)అన్నారు.బుధవారం మం డలంలోని పెదరాజుపాలెం పంచాయతీ నలజనం పాడు రెవెన్యూ గ్రామసభ సర్పంచ్ పందిళ్ళ నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంద ర్భంగా వెంగయ్య,టిడిపి నాయకులు ఏ.రామ కృష్ణంరాజు మాట్లాడుతూ గతప్రభుత్వం చేసిన రీసర్వేలో తప్పులు జరిగి రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు రైతులు అర్జీలు సమర్పిం చిన పరిష్కారం కాలేదని అదేవిధంగా రీసర్వేకు ముందుగా వాగులు, రహదారులు, ప్రభుత్వ భూము లను గుర్తించి సబ్ డివిజన్ చేసి సర్వే మార్కింగ్ వివరాలు రైతులకు విస్తీర్ణం హద్దులు చూపించాలని ప్రతిరైతుకు ఒక యల్ పి యం నెంబర్ కేటాయిం చాలని రెవెన్యూ అధికారులకు సూచించి భూముల రీసర్వేకు ప్రజలు రైతులు సహ కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్య క్షుడు బి.వెంగయ్య, డిటి పి.వెంకటే శ్వర్లు, సర్పంచ్ పందిళ్ళ నాగమణి, వీఆర్వో మాల్యాద్రి, రెవెన్యూ సిబ్బంది, టిడిపి నాయకులు ఏ.రామకృష్ణం రాజు, డి.మాలకొం డయ్య, బి.వెం కటాద్రి, టి.సుబ్బారా యుడు, కె.వెంకటకొండయ్య రైతులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గ్రామదేవతలకు పొంగళ్ళు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని శీలంవారిపల్లె శ్రీఅంకాలమ్మ శ్రీ పోలేరమ్మ గ్రామదే వతల ఉత్సవాల సందర్భంగా బుధవారం ఉదయం మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో పొంగళ్ళు నెత్తిన పెట్టుకొని కోలాహలంగా గ్రామంలో తప్పట్లతో దేవస్థానం వరకు ఊరేగింపుగా వచ్చి పొంగళ్ళు పెట్టి అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కు బడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవ స్థానం ఆవరణలో భక్తులతో సందడి నెలకొన్నది.



## రాతిముఖ మండప నిర్మాణానికి లక్ష విరాళం

అద్దంకి, మేజర్‌న్యూస్: సింగరకొండ ప్రసన్నాంజ నేయ స్వామి దేవస్థానం రాతి ముఖ మండపం నిర్మాణానికి చినగంజాం గ్రామానికి చెందిన శంక రమంచి హనుమంతరావు దంపతులు 1,00,011 రూపాయల విరాళాన్ని బుధవారం ఆలయ సహా య కమిషనర్ తిమ్మానాయుడు కు అందించారు.

## ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదు

ఎంపిడివో మహబూబ్ బాషా



వెలిగండ్ల, మేజర్‌న్యూస్: సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో షేక్ మహబూబ్ బాషా హెచ్చరించారు. బుధవారం మండలంలోని రామ గోపాలపురం, ఇమ్మడి చెరువు, పి.రాళ్లపల్లి, నాగులవరం తదితర సచివాలయాలను ఆకస్మిక ంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్న సర్వేలను త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వం ప్రజల కోసం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి ప్రజలకు అందే విధంగా చూడాలన్నారు. అనంతరం సచివాలయ రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

## దిశా సమావేశంలో సావిత్రి



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: ఒంగోలు కలెక్టరేట్ నందు జరిగిన జిల్లా అడ్వైజరీ కమిటీ (దిశ) మీటింగ్‌లో హనుమంతునిపాడు మండల పరిషత్ అధ్యక్షురాలు గాయం సావిత్రి పాల్గొనడం జరిగింది. హనుమంతునిపాడు మండలంలో శాశ్వత నీటి ఎద్దడి పరిష్కారానికి మండలంలోని చెరువులకు సాగర్ జలాలతో నింపి వేసవిలో నీటి ఎద్దడి సమస్య రాకుండా శాశ్వత పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమె ంట్ సభ్యులు, శాసనసభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు, కలెక్టర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 11న ఏపి నాన్ గజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ సమావేశం

రేపల్లె, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ రేపల్లె యూనిట్ జనరల్ బాడీ సమావేశం ఈ నెల 11న సాయంత్రం 3గంటల కు రేపల్లె మండల పరిషత్ కార్యాలయ సమావే శపు హాలులో నిర్వహిస్తున్నట్లు ఎ.పి.ఎన్.జి.జి.ఓ రేపల్లె యూనిట్ అధ్యక్షులు కె. అంకమ్మరావు బుధ వారం విలేకరులకు తెలిపారు. ఈ సమావే శంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. శ్రీనివా సరావు, ఎ. శ్యాం సుందర్ శ్రీనివాస్ లు పాల్గొని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని ఆయన చెప్పారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేటు తగ్గించాలని

# కోరుతూ సిపిఎం నిరసన ప్రదర్శన



చీమకుర్తి, మేజర్‌న్యూస్: పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లు తగ్గించాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చీమకుర్తి బస్టాండ్ సెంటర్లో జరిగింది ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లు తగ్గుతూ ఉంటే మన దేశంలో మాత్రం కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లను పెంచడం సిగ్గుచేటైన విషయమని కొద్దిమంది కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. కరెంటు చార్జీలు పెరుగుదల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుదల ఇప్పుడు పెట్రోల్,డీజిల్ పై 2/-రూ గ్యాస్ బండ 50/-రూ రేట్లు పెరుగుదల ప్రజలకు భారాల మీద భారాల మోపుతున్నారని అన్నారు. ప్రజలు కేంద్ర ప్రభుత్వ వి ధానాలు వ్యతిరేకించాలని రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా ఎన్నికల ముందు ప్రజల మీద భారాలు మోపమని,ధరలు తగ్గిస్తామని చెప్పి, ప్రజల మీద భారాలు మోపుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు మండల నాయకులు బెజవాడ శ్రీను, తొట్టింపూడి రామారావు, పొత్తూరి సురేష్, బొడ్డు ఓబులేసు, కొల్లూరి వెంకటేశ్వర్లు, మాదాల నరసింగరావు తదితరులు పాల్గొన్నారు



## మాజీ మంత్రి మహీధర్‌రెడ్డికి సత్కారం

కనిగిరి, మేజర్‌న్యూస్: ఆంధ్ర రాష్ట్ర శ్రీ షిరిడి సాయి ధర్మ పరిరక్షణ సేవా సొసైటీ గౌరవ అధ్యక్షులుగా మాజీ మంత్రి మానుగుంట మహీధర రెడ్డి, గౌరవ సలహాదారునిగా మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి సంఘం విధులు నిర్వహించుటకు తమ అంగీకారాన్ని తెలపడం పట్ల రాష్ట్ర కమిటీ కార్యదర్శి గోపాలుని హరి హరరావు, సహాయ కార్యదర్శి దేవకి సుబ్రహ్మణ్యం, ప్రకాశం జిల్లా బాబా ఆలయాల అధ్యక్షులు అలహరి చంచలరావు, కందుకూరు నుండి శ్రీరామ్ మూర్తి, నరసింహారావు, కనిగిరి నుండి ముచ్చర్ల ధర్మారావు, వాగిచెర్ల వెంకటేశ్వర్లు వారిని ఘనంగా సన్మానించారు. రాష్ట్రా అధ్యక్షులు సాయి దాసు, ఉపాధ్యక్షులు కర్లపూడి కృష్ణ, సహాయ కార్యదర్శి ఆదిపూడి సాయిరాం, మైలవరం బాలాజీరావు, శ్రీకాకుళం నాగభూషణం, చిత్తూరు వరలక్ష్మి, వైజాగ్ సత్య కుమార్ తమ అభినందనలు తెలియజేశారు. సాయితత్వ ప్రచారానికి, సేవా కార్యక్రమాలకు, మా శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని గౌరవ అధ్యక్షులు, గౌరవ సలహాదారులు తెలిపారు.

# ప్రజలకు అండగా నిలిచేందుకు సాధికార సమితి నియామకం



పామూరు, మేజర్‌న్యూస్: ప్రజలకు మరింత అండగా నిలబడేందుకు తెలుగుదేశం ప్రభుత్వం కొత్త విభాగాన్ని అమలు చేసిందని తెలుగు దేశంపార్టీ పామూరు మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పిలుపుమేరకు టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పలు గ్రామాలలో 60 ఓటర్లకు నియమితులైన కుటుంబ సాధికార సమితి సభ్యుల జాబితాను మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లకు అందజేశారు. ఈ సందర్భంగా పువ్వాడి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై తక్షణమే పరిష్కరించేందుకు టిడిపి ఆధ్వర్యంలో 60 ఓటర్లకు ఒకరు పురుషుడు, మహిళ కుటుంబ సాధికార సమితి సభ్యులను నియమించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి దరి చేరేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నరసాపురం ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహారావు, సయ్యద్ అమీర్‌బాబు, యిర్రి కోటిరెడ్డి, కల్లూరి తిరుపతయ్య, మన్నం రమణయ్య, కమ్మ బాల కృష్ణ, దారపనేని మాధవ రావు, మండ్ల రమణయ్య, మెంటా నరసింహారావు, పత్తు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

– డైట్ ప్రిన్సిపాల్ సుబ్బారావు –



కనిగిరి, మేజర్‌న్యూస్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్ )ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు సూచించారు. స్థానిక కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కనిగిరి డివిజన్ పరిధిలోని ఆరు మండలాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలతో బుధవారం సమావేశం నిర్వహించారు. నాయకత్వ శిక్షణ కార్యక్రమాల్లో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టాలని, నైపుణ్యాలను పెంపొందించుకొని వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాలలను అభ్యాసన సంస్థగా అభివృద్ధి చేయడానికి సమర్ధవంతమైన వ్యూహాలను రూపొందించుకోవాలన్నారు. విద్యార్థుల మధ్య సామర్థ్య అభివృద్ధిని ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో ఎస్-ఎల్‌డిపి శిక్షణకు సంబంధించిన ఫీడ్‌బ్యాక్ ఆచరణ అంశాలను ప్రధానోపాధ్యాయులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఏఎంసి చైర్మన్ రమా శ్రీనివాస్‌ను కలసిన హరీష్



పామూరు, మేజర్‌న్యూస్: కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్‌ను పట్టణ తెలుగు యువత అధ్యక్షులు పందిటి హరీష్ కలిశారు. ఇటీవల ఏఎంసీ చైర్మన్ నియామకం అవడంతో బుధవారం క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు పొంది ప్రజాసేవకుడిగా గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీని అగ్ర భాగాన నిలిపేందుకు కృషి చేయాలన్నారు.

## తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం




చీమకుర్తి, మేజర్‌న్యూస్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, పుట్టిన వెంటనే శిశువుకు తల్లిపాలు పట్టించాలని చీమకుర్తి మండల పరిషత్ పరిపాలనాధికారి వజ్జా శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం పోషణ పక్వాడా రెండవ రోజు కార్యక్రమం మద్దిపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ పి. ఆర్ ఇవాంజలిన్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమాలు లోప పోషణ, తీవ్ర లోప పోషణ కలిగిన పిల్లలు హైరిస్క్ గర్భవతులు రక్తహీనతతో ఉన్న కిషోర్ బాలికలను గుర్తించారు. విద్యానగర్, రెడ్డి బజార్, గాంధీనగర్, రాంనగర్ సచివాలయాల పరిధిలోగల 20 మంది శ్యామ్, మ్యామ్ పిల్లలను గుర్తించి వారిగృహాలను సందర్శించారు. పై కార్యక్రమాలను ఐసిడిఎస్ సూపర్వైజర్స్ కే ప్రమీల ఆర్ పిచ్చమ్మ కే దేవసేన, అర్బన్ పీహెచ్సీ డాక్టర్ బేబీ రాణి, నాలుగు సచివాలయాల జిఎంఎస్‌కేలు ఏఎన్ఎంలు ఆశాకార్యకర్తలు అంగన్వాడీ టీచర్స్ ఆయాలు,తల్లులుమండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## నేడు ఒంగోలుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

ఒంగోలు, మేజర్‌న్యూస్: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ గురువారం ఒంగోలు రానున్నారు. సిపిఐ ప్రకాశం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఒంగోలులో ఇల్లు లేని పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చిన అగ్రహారం భూములను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణతో పాటుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా సమితి సభ్యులు, లబ్ధిదారులతో కలిసి పరిశీలించనున్నారు. అనంతరం రామకృష్ణ ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాలో పాల్గొంటారు.

## పౌష్టికాహారంతోనే గర్భిణీలకు ఆరోగ్యం

పౌష్టికాహార పక్షోత్సవంలో ఏఎంసి చైర్మన్ యారవ రమాశ్రీను



పామూరు, మేజర్‌న్యూస్: గర్భిణీల రక్తహీనతను నియంత్రించేందుకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుందని కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బుక్కాపురం అంగన్వాడి కేంద్రంలో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ మాట్లాడుతూ గర్భిణీలు ప్రతిరోజు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. బాలింతలు, గర్భిణీలు, కిషోర్ బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. వివిధ రకాల పౌష్టికాహారాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మయ్య,టిడిపి దూబగుంట గ్రామ కమిటీ అధ్యక్షులు దయుండే శివశంకర్, టిడిపి జిల్లా నాయకులు సయ్యద్ అమీర్ బాబు, దూబగుంట అంగన్వాడి ఉపాధ్యాయురాలు దయుండే భాగ్యలక్ష్మి, లక్ష్మీనారాయణమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రదీప్ కుమార్, అంగన్వాడి సూపర్వైజర్ గోళ్ళ పద్మజ, షేక్ నాయబ్ రసూల్, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బెల్లంకొండ విద్యామందిర్ వార్షికోత్సవ వేడుకలు







సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన సి.ఎస్.పురంలోని బెల్లంకొండ విద్యామందిర్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలు 9వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం స్థానిక ఆర్‌యంయస్ కళ్యాణమండపంలో రత్నం విద్యాసంస్థల అధినేత, సెక్రటరీ, కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా వచ్చిన స్థానిక యస్ఐ ఆర్.సుమన్, మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు (వెంగయ్య), సర్పంచ్ శ్రీరాంపద్మావతి పలువురు ప్రముఖులు ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వార్షికోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకర్షించాయి. ఈసందర్భంగా విద్యా సంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి సహకరిస్తున్న విద్యార్థులకు తల్లి దండ్రులకు మండల ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు అన్నారు.బెల్లంకొండ సంస్థల నిర్వాహకులు మద్దుల శ్రీనివాసులు,యస్ఐ ఆర్.సుమన్, మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ బొమ్మనబోయిన వెంగయ్య, సర్పంచ్ శ్రీరాం పద్మావతి, ఉపసర్పంచ్ పి.నరసయ్య, మండలటిడిపి నాయకులు బి.వెంకటాద్రి, స్థానికులు, విద్యాసంస్థల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, అభిమానులు పాల్గొన్నారు.

## అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దు

### – అవగాహన పోస్టర్ ఆవిష్కరణ –



ఒంగోలు, మేజర్‌న్యూస్ : అనధికార లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే నష్టపోవాల్సి వస్తుందని జాయింట్ కలెక్టర్, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ ఆర్. గోపాలకృష్ణ చెప్పారు. స్థిరాస్తి కొనుగోలుదారులు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధి, ఈ విభాగం అందించే సేవలు, అనుమతులు, తదితర వివరాలతో పాటు స్థిరాస్తి కొనుగోలుదారులకు అవసరమైన సూచనలు చేసేలా రూపొందించిన పోస్టర్లను, కరపత్రాలను బుధవారం ప్రకాశం భవనంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, కనిగిరి శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి, సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్ విజయకుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాతలతో కలిసి ఆవిష్కరించారు.

## ఆలయ మండపానికి రామానంద సరస్వతి స్వామీజీ విరాళం



చీరాల రూరల్, మేజర్‌న్యూస్: చీరాల రూరల్ మండలం ఈపురుపాలెం గ్రామంలోని లక్ష్మి అనంత పద్మ స్వామి దేవాలయ కళ్యాణ మండపానికి రామానంద సరస్వతి స్వామీజీ రూ.1,50,000లు విరాళం అందజేశారు. సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, రామానంద సరస్వతి స్వామీజీ ఆలయాన్ని పరిశీలించారు. గతంలో కూడా స్వామీజీ ఆలయానికి లక్ష యాభై వేలు అందజేశారు. అనంతరం చదువుకునే పేద విద్యార్థులకు కూడా కొంత ఆర్థిక సహాయాన్ని స్వామీజీ, ఆమంచి కృష్ణమోహన్ చేతులు మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చీరాల జడ్పిటిసి ఆకురాతి పద్మిని, ఈపురుపాలెం మాజీ సర్పంచ్ గంజి వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి అనంత పద్మనాభ స్వామి వారి దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## హైవేలపై డ్రోన్లతో నిఘా

### యువత బైక్ రేసింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

### తాలూకా సిఐ అజయ్‌బాబు హెచ్చరిక



ఒంగోలు, మేజర్‌న్యూస్ : హైవేలపై డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంది, స్టూడెంట్స్, యువత ఎవ్వరైనా హైవేలపై బైక్ రేసింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోందని తాలూకా సిఐ అజయ్ బాబు హెచ్చరించారు. బుధవారం పత్రికా ప్రకటన ద్వారా పలు విషయాలు సూచించారు. ఈ మధ్యకాలంలో హైవేలపై స్టూడెంట్స్ బైక్ రేసింగ్‌లకు నంబర్లు లేని వెహికల్ మీద పాల్పడుతున్నారు. ఈ విధంగా పాల్పడుతున్న వారిపై డ్రోన్ కెమెరాల ద్వారా, సీసీ కెమెరాలు ద్వారా నిఘా పెట్టడం జరిగింది. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టు ముందు హాజరు పెట్టడం జరుగుతుంది కావున తల్లిదండ్రులు మీ పిల్లలు బైకులపై ఎలాంటి పనులు చేస్తున్నారో గమనించండి కేసులు నమోదు చేసిన తర్వాత వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన కృష్ణకిషోర్

గిద్దలూరు, మేజర్‌న్యూస్: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మంచినీటి చలవేంద్రాన్ని గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పవన్‌కల్యాణ్ కుమారుడు త్వరగా కోలుకోవాలి: కంది రవిశంకర్

### ఆంజనేయస్వామి ఆలయంలో జనసేన బృందం పూజలు





ఒంగోలు, మేజర్‌న్యూస్: అగ్ని ప్రమాదానికి గురైన జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ త్వరగా కోలుకోవాలని బుధవారం ఒంగోలులోని మంగమ్మ కాలేజీ వద్ద ఆంజనేయస్వామి గుడిలో జనసేన శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి రవిశంకర్ గ్రూప్ అధినేత, ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆ దేవుడి ఆశీస్సులు ఉండాలని ఒంగోలు నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో 101 టెంకాయలతో పూజ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శులు చనపతి రాంబాబు, కళ్యాణ్ ముత్యాల,కృష్ణ పెన్నా ప్రాంతీయ కమిటీ సభ్యురాలు బొందిల శ్రీదేవి, ఒంగోలు నగర జనసేన పార్టీ ఉపాధ్యక్షులు పిల్లి రాజేష్, ఒంగోలు నగర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు పల్ల ప్రమీల, దండే అనిల్, ఒంగోలు నగర జనసేన పార్టీ కార్యదర్శులు గోవింద్ కోమలి,మనోజ్ రాయల్, ఆకుపాటి ఉష, మాల్యాద్రి నాయుడు, ఒంగోలు నగర సంయుక్త కార్యదర్శి సుంకర కళ్యాణి, తన్నీరు ఉష, 3వ డివిజన్ అధ్యక్షురాలు షేక్ ముంతాజ్, 2వ డివిజన్ అధ్యక్షులు బ్రహ్మ నాయుడు, 38వ డివిజన్ అధ్యక్షులు ఆలా నారాయణ, 9వ డివిజన్ అధ్యక్షులు నరసింహా రావు, 15వ డివిజన్ ఉపాధ్యక్షులు ఉంగరాల సాయి, 16వ డివిజన్ అధ్యక్షులు అల్లూరి శ్రీహరి, ఉపాధ్యక్షులు కర్రీ శ్రీకాంత్, 21వ డివిజన్ అధ్యక్షురాలు వాసుకి నాయుడు, 37వ డివిజన్ అధ్యక్షులు నరహరి సాంబయ్య, జనసేన నాయకులు కాసాని వాసు, తిరుమలశెట్టి వెంకట్రావు, పసుపులేటి శ్రీధర్, బాయిరెడ్డి వేణు, వెంకటేష్, జగతపి మహేష్, శ్రీ సాయి, అంజిని నాయుడు, బండారు గిరి, అవినాష్ నాయుడు, పోలిరెడ్డి, కాకుమాను శివ రావు, ఆనంద్ నాయుడు కత్తుల, వీర మహిళలు నక్క ప్రమీల, ఏడుంబాకుల అనూష, నాగేంద్రం, తెలుగు మహిళలు దుర్గ మల్లేశ్వరి, కొక్కిలిగడ్డ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ వ్యవస్థకు జగన్ క్షమాపణ చెప్పాలి

### టిడిపి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి



దర్శి, మేజర్‌న్యూస్: చనిపోయిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించే పేరుతో జగన్ ఆడిన నాటకం, పోలీస్ వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలు ఆయనలోని ఆధిపత్య భావజాలానికి, అహంకారానికి నిదర్శనాలనే దర్శి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన వ్యక్తి, కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి, స్థానిక నాయకుల సమస్యలు విని వారిలో భరోసా నింపాలి. కానీ రాప్తాడు నియోజకవర్గంలోని రామగిరి మండలం, పాపిరెడ్డిపల్లెలో జగన్ చేసిన వీరంగం యాక్షన్ సినిమా క్లైమాక్స్‌ను తలధన్నే విధముగా ఉందని, పేరుకే పరామర్శ తప్ప జగన్ ప్రదర్శించినవన్నీ ఫ్యాక్షనిస్ట్ పోకడలే. పోలీసుల బట్టలు ఊడదీయిస్తానన్న జగన్ వ్యాఖ్యలు, ప్రజాస్వామ్యంలో ప్రజల రక్షణ బాధ్యతల్లో తలమునకలైన పోలీస్ వ్యవస్థకే మాయని మచ్చగా నిలిచాయని ఆమె అన్నారు. మహిళా పోలీస్ అధికారులు ఆ జిల్లాలో విధి నిర్వహణలో ఉన్నారని తెలిసీ జగన్ అలా వ్యాఖ్యానించడం సిగ్గుచేటు. పోలీసులు సరిగా పనిచేయకపోతే జగన్ రాప్తాడులో స్వేచ్ఛగా పర్యటించి, యథేచ్ఛగా నోరు పారేసు కోగలిగేవాడా, తన పర్యటనలో భాగంగా హెలిప్యాడ్ వద్ద, పాపిరెడ్డి పల్లె చుట్టూ రక్షణగా నిలిచిన వందలమంది పోలీసులు జగన్‌కు కనిపించలేదా, పోలీస్ వ్యవస్థ జగన్ తీరుని ఏమాత్రం ఉపేక్షించకూడదు. సాటి మహిళా పోలీస్ సిబ్బందిని దూషించిన వ్యక్తికి ఇప్పుడు బుద్ధిచెప్పకపోతే, అతన్ని ఆదర్శంగా తీసుకొని మునుముందు వైసీపీ శ్రేణులు రెట్టింపు మదంతో రెచ్చిపోతారనే వాస్తవాన్ని పోలీస్ ఉన్నతాధికారులు గ్రహించాలని దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు.

## శ్రీ ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయంలో ఎంపి మాగుంట పూజలు



ఒంగోలు, మేజర్‌న్యూస్: నగరంలోని కేశవస్వామిపేటలో శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో శివ కుమార్ మాగుంటకు సాదర స్వాగతం పలికారు. మాగుంట వెంట తాతా ప్రసాద్, బెల్లం సత్యం, శ్రీనారెడ్డి, రమణారెడ్డి, నాదెండ్ల సుధాకర్, అల్లూరి శ్రీను తదితరులు ఉన్నారు.

## వేసవిలో ప్రజల దాహార్తి తీర్చాలి




కొత్తపట్నం, మేజర్‌న్యూస్: వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా ప్రజల దాహార్తి తీర్చాలని మండల పరిషత్ అధ్యక్షులు లంకపోతు అంజిరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారుల పనితీరును ఎంపీటీసీలు సర్పంచులు నిలదీశారు. ఆర్డబ్ల్యూఎస్ శాఖ ద్వారా వస్తున్న జలజీవన్ మిషన్ పథకంలో గత ప్రభుత్వం హయాంలో పైప్ లైన్లు నిర్మించడం జరిగిందని వాటికి సరైన బోర్లు వేయకపోవడంతో నీటి సరఫరా అందులో లేదని ఎంపీటీసీలు సర్పంచులు వాపోయారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, ఎంపీపీ అంజిరెడ్డి మాట్లాడుతూ మండలంలో శాశ్వత నీటి పరిష్కారానికి వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తే తప్ప పరిష్కారం కుదరుదన్నారు.

## కాసు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కళాకారులకు సత్కారం



కొనకనమిట్ల, మేజర్‌న్యూస్: మండలంలోని గొట్లగట్టు గ్రామంలో కాసు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాసు వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో పలువురు సీనియర్ కళాకారులను సన్మానించారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన భక్త చింతామణి అనే పౌరాణిక నాటకం ప్రదర్శనలో భాగంగా నాటకం ప్రదర్శించిన కళాకారులతోపాటు, గొట్లగట్టులో సత్యహరిచంద్ర, చింతామణి, బ్రహ్మంగారి నాటకాలలో ప్రధాన పాత్రలు పోషించిన సీనియర్ కళాకారులను గుర్తించి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.కలలను ప్రోత్సహించాలనే సంకల్పంతో కళాకారులను అభినందించి వారిని ప్రోత్సహిస్తామని చైర్మన్ కాసు వెంకటేశ్వర్ రెడ్డి, ట్రస్ట్ కోఆర్డినేటర్ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు . అంతే కాకుండా ట్రస్ట్ తరఫున వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అద్దంకి చెందిన సీనియర్ కళాకారుడు, హాస్యనటుడు అద్దంకి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటివరకు భక్త చింతామణి నాటకాన్ని 6500 సార్లు పైగా ఆడినట్లు తెలిపారు.ఇంకా మరికొన్ని నాటకాలు ఆడి గిన్నిస్ బుక్ లో రికార్డు సంపాదించాలని కళాకారుడు శ్రీనివాసరావును సీనియర్ కళాకారులు ప్రోత్సహించారు.

## శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు: ఎస్ఐ



ముండ్లమూరు, మేజర్ న్యూస్: మండలంలోని గ్రామాలలో శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసు కుంటానని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. ముండ్లమూరు ఎస్ఐగా కె.కమలాకర్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఒంగోలు విఆర్‌లో ఉన్న కమలాకర్‌ను ముండ్లమూరు ఎస్సైగా నియమిస్తూ ఎస్పి ఏఆర్ దామోదర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఎస్పీ ఉత్తర్వులు మేరకు కమలాకర్ ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న వై.నాగరాజు బదిలీపై బాపట్ల జిల్లా బల్లికురవ ఎస్సైగా బదిలీ అయ్యారు.

# చంద్ర రాజేశ్వరరావు చిరస్మరణీయులు

భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: భారత స్వాతంత్ర్య సమరయోధుడు,ఉత్తమ కమ్యూనిస్టు,తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించి,నిజాం పాలనకు వ్యతిరేకంగా రైతాంగ,కార్మికుల హక్కుల కోసం పోరాడిన గొప్ప కమ్యూనిస్టు ఉద్యమకారుడు అమరజీవి చంద్ర రాజేశ్వరరావు చిరస్మరణీయులని సిపిఐ బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ అన్నారు.వేమూరు నియోజకవర్గ సిపిఐ సమితి ఆధ్వర్యంలో అమరజీవి చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు సిపిఐ పార్టీ ప్రధాన



కార్యదర్శిగా 28 సంవత్సరాల పాటు పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించి ఉత్తమ కమ్యూనిస్టుగా సేవలందించారన్నారు.చంద్ర రాజేశ్వరరావు అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడుగా రైతుల తరపున ఎన్నో పోరాటాలు చేశారని ఆయన గుర్తు చేశారు.1974లో సోవియట్ యూనియన్ అతనికి ఆర్డర్ ఆఫ్ లెనిన్ అనే ప్రతిష్టాత్మక అవార్డును ప్రధానం చేసిందని,ఇది అతని కమ్యూనిస్టు ఉద్యమ సేవలకు గుర్తింపుగా లభించిందన్నారు.తన జీవితాన్ని పార్టీ శ్రేయస్సు కోసం ధారబోశారని,తన యావద్ఆస్థి 400 య కరాల భూమిని పేద ప్రజలకు పంచారని కొనియాడారు.తను మరణిస్తే బట్టలు పేదవారికి,పుస్తకాలు పార్టీ గ్రంధాలయాలకు అప్పజెప్పాలని వీలునామలో పేర్కొన్న మహా మనీషి చంద్ర రాజేశ్వరరావు అని,ఆశయ సాధనకై పార్టీ కార్యకర్తలు, నాయకులు ముందుకు సాగుదామని ఆయన పిలుపునిచ్చారు. నిరంతరం పేద,బడుగు బలహీన వర్గాల కోసం ఉద్యమించి పేదలకు భూ పోరాటాల ద్వారా పంచిపెట్టారని బాలాజీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు విష్ణుమొలకల శ్రీనివాసరావు, ఒబులశెట్టి రమేష్,ఎఐటియుసి నాయకులు దాసరి నాగరాజు, కోన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రగతిని ప్రచారం చేస్తున్న బిజెపి మోర్చా అధ్యక్షులు



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: భారతీయ జనతా పార్టీ 45 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం 19,27,30 వార్డులలో బిజెపి యువ మోర్చా అధ్యక్షులు నాళం నరేష్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ వికసిత్ భారత్ దిశగా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల గురించి వార్డు ప్రజలకు వివరించారు. కొత్త పంబన్ బ్రిడ్జి రామేశ్వరం, తాంబరం మధ్య కొత్త రైలు ప్రారంభించడం, వాలాజ పేట, రాణి పేట, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోని 4- లైన్ల నిర్మాణం, రూ. 8500 కోట్లు విలువైన ప్రాజెక్టుల ప్రారంభానికి పునాది రాయి వేస్తున్నారని రాష్ట్రానికి సగర్వంగా నరేంద్ర మోది పనిచేస్తున్నారని తెలిపారు. మారం మణి, ఇమ్మడిశెట్టి రాము, బాలాజీ, సుజిత్, విజయ్, శ్రీనివాసరావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## చర్చిలో జనసేన నాయకులు ప్రత్యేక ప్రార్థనలు

బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: బాపట్ల మండలం మారుప్రోలువారిపాలెం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు బాపట్ల జనసేన పార్టీ నాయకులు. సింగపూర్ లోని స్కూల్లో నిన్న జరిగినటువంటి అగ్ని ప్రమాదంలో మన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ కు కాళ్ళు చేతులకు స్వల్ప గాయలు ఊపిరితిత్తులలోకి పొగ చేరడం కారణంగా జనసేన పార్టీ బాపట్ల రూరల్ మండలం అధ్యక్షులు దాసరి ఏసుబాబు ఆధ్వర్యంలో బాపట్ల నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివ నారాయణ పాల్గొని మరుప్రోలు వారి పాలెం లోని ప్రార్థన మందిరంలో మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిం చారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీ వారి కుటుంబ సభ్యులకు ప్రభు ఆశీస్సులు ఎప్పుడూ ఉండాలని కళ్యాణ్ కుటుంబంపై తమ ఆప్యాయతను వెలుబుచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు దాసరి వెంకటే శ్వర్లు, ఉమ్మడి గుంటూరు జిల్లా లీగల్ సెల్ సభ్యురాలు, ఏరియా హాస్పిటల్ డెవలప్మెంట్ సభ్యురాలు జిడుగు విజయ మాధురి,కొక్కిరాల రాజేంద్ర,దాసరి బాలస్వామి, దాసరి కోటయ్య, ప్యార్లీ ఏసోబు, ప్యార్లి బాబురావు, గొర్రిమూచ్చు బోయజు, దాసరి రవి, ప్యార్లి నాని, డీజే రాజేష్,మేరుగ రత్నరాజు, అజయ్,ప్యార్లి చందు, గజ్జె వెంకటేష్ , జిడుగు రాజేష్, సిగిరిశెట్టి సంజ య్ నాయుడు, జన సైనికులు వీర మహిళలు పవన్ కళ్యాణ్ వీరాభిమానులు పాల్గొన్నారు.

## జగన్‌కు భద్రత కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యం



వేమూరు(భట్టిప్రోలు) మేజర్‌న్యూస్: మాజీ ముఖ్యమంత్రి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డికి భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేమురు వైసిపి ఇంచార్జ్ వరికూటి అశోక్ బాబు విమర్శించారు.బుధవారం విలేకరు లతో మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కావాలని తాత్సారం చేస్తూ వ్యవహరించిందన్నారు.మాజీ ముఖ్యమంత్రి పర్యటన ఉందని తెలుసి కూడ పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించారని విమర్శిం చారు. ప్రజాదరణ ఉన్న జగన్మోహన్ రెడ్డి పర్యటనకు తీసుకోవాల్సిన కనీస భద్రత చర్యలు కూడా తీసుకోకుండా పోలీసులు వ్యవహరించారనే దానికి హెలిప్యాడ్ వద్ద ప్రజలు చేరిన విధానమే నిదర్శనం అన్నారు.ప్రజల ఆదరణ పొందు తున్న జగన్మోహన్ రెడ్డి పర్యటన చూసి ఓర్చుకోలేక రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను వెనక్కి తగ్గే విధంగా చేసిందని అశోక్ బాబు ఆరోపిం చారు. కనీస భద్రత వల యం కూడా లేకుండానే జగన్మోహన్ రెడ్డి పర్యటన జరిగిందని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక తప్పించుకునే ధోరణిలో వ్యవహరిస్తుం దని, ప్రభుత్వ హామీలను వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఎక్కడ లేవనెత్తారో అని భయప డుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుయు క్తులు పన్నిన ప్రజల్లో జగన్మోహన్ రెడ్డి ప్రతిష్ట పెరుగుతుందే తప్ప తగ్గదని రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి తగిన గుణ పాఠం చెప్తారని అశోక్ బాబు హెచ్చరించారు.

## మోడీకి కృతజ్ఞతలు తెలిపిన ఉపాధ్యాయులు



దర్శి, మేజర్‌న్యూస్: మోడీ ఎంటర్ప్రైజెస్ చైర్ పర్సన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బినా మోడీ ఫిబ్రవరి 12న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చందలూరు, బోధనంపాడు పాఠశాలల్లో సందర్శించి పిల్లలతో మమేకమై వాళ్ల విద్య గురించి, మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు కావాల్సిన సదుపాయాలు అందజేస్తామని హామీ ఇచ్చి ఉన్నారు. దీనికి అనుగుణంగా చందలూరు పాఠశాలకు సైకిల్ స్టాండ్ నిర్మాణం ప్రారంభమై శరవేగంగా పనులు జరుగుతున్నాయి అలానే రెండు డెస్క్టాప్‌లు, ప్రింటర్ కం జిరాక్స్ మిషన్ అందజేశారు. బోధనంపాడు పాఠశాలకు ఒక డెస్క్టాప్, ప్రింటర్ కం జిరాక్స్ మిషన్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జీపీఐ లోకల్ మేనేజర్స్, స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఇందుకు గాను ఉపాధ్యాయులు, పిల్లలు అందరూ మోడీ ఎంటర్ప్రైజెస్ సంస్థకి, డాక్టర్ బినా మోడీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఆదర్శనీయులు జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

అద్దంకి, మేజర్‌న్యూస్: మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గొప్ప సామాజికవేత్తలు ఆదర్శనీయులని వారి చరిత్రను నేటితరం విద్యార్థులు తెలుసుకోవాలని తహసిల్దార్ జి శ్రీ చరణ్ అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం నందు నియోజకవర్గస్థాయి వ్యాసరచన డిబేట్ పోటీ పరీక్షల కరపత్రాన్ని తహసిల్దార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ మహాత్మ పులే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగే వ్యాసరచన, డిబేట్ పోటీ పరీక్షలు పాఠశాల, కళాశాల విద్యార్థులకు నిర్వహించడం శుభ పరిణామం అని అన్నారు. జయంతి ఉత్సవాల కమిటీ కన్వీనర్ అంకం కిరణ్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహిస్తున్నామని వ్యాసరచన పోటీ పరీక్ష డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రపై, డిబేట్ పోటీ పరీక్షలు మహాత్మ జ్యోతిరావు పూలే చరిత్ర మీద జరుగుతున్నాయని,



మొదటి బహుమతి 5116/, రెండవ బహుమతి 3116 /, మూడవ బహుమతి 2116/, 4వ బహుమతి 1116/ ఇవ్వనున్నామని, కావున విద్యార్థులు ఈ పోటీ పరీక్షలలో పాల్గొని విజేతలు కావాలని అన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులు కలవని విజేతలైన వారికి ఈ నెల 14న జరిగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సభ ద్వారా బహుమతులను ప్రధానం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ పి సురేష్, మండల సర్వేయర్ శ్రీలక్ష్మి, ఏఎస్ఓ అమర్ నాథ్, ఆర్ ఐ శంకర్, మహాత్మ పులే అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ సభ్యులు శ్రీకృష్ణ, రాజశేఖర్, గురవయ్య, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

## కుంగిన రైల్వే ట్రాక్‌కు మరమ్మతులు

### ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణీకులు




భట్టిప్రోలు,మేజర్ న్యూస్: రేపల్లె-తెనాలి రైలు మార్గంలో భట్టిప్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో గల రైల్వే గేటు వద్ద రైలు పట్టాలు రోడ్డు లెవల్ కు మించి క్రిందకు కృంగిపోవ డంతో రైల్వే శాఖ మరమ్మత్తులకు శ్రీకారం చుట్టింది.బుధవారం ఉదయం నుండి రైల్వే గేటును మూసివేసి మరమ్మత్తు పనులను కొనసాగించారు.ఈ క్రమంలో ఆ మార్గం గుండా ప్రయాణించవలసిన రేపల్లె-విజయవాడ బస్సు సర్వీసులు, అదేవిధంగా భట్టిప్రోలు- వెల్లటూరు మార్గంలో ఉన్న విశ్వశాంతి పాఠశాల విద్యార్థులు ప్రయాణించేందుకు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.సరైన సమాచారం లేకపోవడంతో సమీపం వరకు వచ్చిన ద్విచక్ర వాహనదారులు వెనుతిరిగి రావాలంటే సుమారు 20 నుండి 25 కిలోమీటర్లు ప్రయాణించి గమ్యాన్ని చేరుకునే పరిస్థితి ఏర్పడింది.గతంలో భట్టిప్రోలు- పెదపులివర్రు రహదారి మార్గం స్థానిక మండల పరిషత్ కార్యాలయం పక్క రోడ్డు నుండి ఉండేది.దానిని పునరుద్ధరించి రైల్వే గేటు పక్క నుండి మరలించటం వల్ల కనీసం ఆ మార్గాన్ని ఎంచుకునే అవకాశం కూడా ప్రయాణికులకు లేకపోయింది.ఈ మరమ్మతులు గురువారం కూడా కొనసాగే పరిస్థితి ఉందని రైల్వే శాఖ అధికారులు తెలియచేస్తున్నారు. అయితే మరమ్మతులు త్వరగా పూర్తి చేసి రోడ్డు మార్గాన్ని త్వరితగతిన ప్రారంభించాలని పలువురు ప్రయాణికులు, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## తడి, పొడి చెత్తలను సంపద తయారీ కేంద్రానికి చేర్చాలి: డిఎల్‌పిఓ పద్మ

ముండ్లమూరు, మేజర్‌న్యూస్: గ్రామపంచాయతీలో తడి పొడి చెత్తలను గ్రీన్ అంబాసిడర్లు సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించే విధంగా సర్పంచులు, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఒంగోలు డిఎల్‌పిఓ పద్మ సూచిం చారు. మండలంలోని కెలంపల్లి, పెద్ద ఉల్లగల్లు, వేముల, ఈదర గ్రామపం చాయతీలలో ఐవిఆర్‌యస్ గ్రామ పంచాయతీలలో భాగంగా ఇంటి ఇంటికి తిరిగి తడి పొడి చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది.



ఆయా గ్రామాల్లోని మహిళలు గ్రామస్తులకు గ్రామాల్లో పరిశుభ్రత గురించి అవగాహన కలుగజేశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేం దుకు ప్రతి ఒక్కరు సహకరించి ఇంటిలోని తడి పొడి చెత్తను పంచా యతీ వారు ఏర్పాటు చేసిన ప్రదేశా లలో వేయాలని, అక్కడి నుండి గ్రీన్ అంబాసిడర్లు సంపద తయారీ కేంద్రాలకు తరలించడం జరుగుతుం దన్నారు. గ్రామపం చాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి మరుగు కాలువలు, రోడ్లకు ఇరువై పులా చెత్త లేకుండా చూడవలసిన బాధ్యత కార్యదర్శులదే అని వారిని ఆదేశించారు. ఆమె వెంట కార్య దర్శులు జే.రాజరాజేశ్వరి, జి.గురునాథం, షేక్.షమీర్, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు